నేటి దినపత్రిక
# సూర్య
www.suryaa.com
శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు
07 జూన్ 2025 పేజీలు : 08
శనివారం



## విలువలతో కూడిన విద్య..
# పిల్లల భవిష్యత్తుకు నాంది

■ ఎస్పీ కృష్ణకాంత్



విలువలతో కూడిన విద్య పిల్లల భవిష్యత్తుకు ఎంతో ఉపయోగపడుతుందని ఎస్పీ కృష్ణకాంత్ పేర్కొన్నారు. ఉమేష్ చంద్ర కాన్ఫరెన్స్ హాలులో పోలీసు పిల్లలకు కౌన్సెలింగ్ ఇచ్చి కోరుకున్న కార్పొరేట్ కళాశాలలలో ఉచిత అడ్మిషన్స్ అందించారు.

వివరాలు 2లో

## చివరి దశకు చేరుకున్న వీఆర్సీ హైస్కూల్
# ఆధునీకరణ పనులు



- వీఆర్ హైస్కూలు పనులను పరిశీలించిన పొంగూరు షరణి
- మంత్రి పొంగూరు నారాయణ మహా సంకల్పంతో వీఆర్ హైస్కూల్ రూపురేఖలు మార్పు
- పేద విద్యార్థులకు ఇంటరాక్టివ్, డిజిటల్ విద్యను అందించడమే లక్ష్యం

నెల్లూరు అర్బన్/క్రైం, మేజర్‌న్యూస్ :

పేద విద్యార్థులకు డిజిటల్ విద్యను అందించాలని మహా సంకల్పంతో రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ సంకల్పించిన వీఆర్ హైస్కూల్ ఆధునీకరణ పనులు చివరి దశకు చేరుకున్నట్లు మంత్రి నారాయణ కుమార్తె పొంగూరు షరణి తెలిపారు. కార్పొరేట్ స్కూల్స్‌ని తలదన్నేలా సిద్ధమవుతున్న పేదపిల్లల పాఠశాల వీఆర్ హైస్కూల్‌ను ఆమె శుక్రవారం పరిశీలించారు. పనుల పురోగతిని అక్కడ సిబ్బందిని

-మిగతా 2లో



# విలువలతో కూడిన విద్య.. పిల్లల భవిష్యత్తుకు నాంది : ఎస్పీ






**నెల్లూరు అర్బన్/క్రైం, మేజర్‌న్యూస్ :** విలువలతో కూడిన విద్య పిల్లల భవిష్యత్తుకు ఎంతో ఉపయోగపడుతుందని ఎస్పీ కృష్ణకాంత్ పేర్కొన్నారు. ఉమేష్ చంద్ర కాన్ఫరెన్స్ హాలులో పోలీసు పిల్లలకు కౌన్సెలింగ్ ఇచ్చి కోరుకున్న కార్పొరేట్ కళాశాలలలో ఉచిత అడ్మిషన్స్ అందించారు. పోలీసు పిల్లలు క్రమశిక్షణతో, జీవిత లక్ష్యం ఆధారంగా కష్టపడి చదివి ఉన్నతస్థాయికి వెళ్లాలని, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలన్నారు. మంచి మార్కులు పొందిన పోలీసు పిల్లలు, తల్లిదండ్రులను ఎస్పీ అభినందించారు. మొత్తం 111 మంది పోలీసు పిల్లలకు 11 కార్పొరేట్ కళాశాలలలో ఉచిత, రాయితీ అడ్మిషన్స్ కేటాయించారు. పోలీస్ పిల్లలు ఉన్నత స్థాయిలో ఉన్నారంటే.. మన అందరికీ చాలా గౌరవం.. మొదట సంతోషపడేది తల్లిదండ్రులే అన్నారు. పోలీసుల సంక్షేమమే మొదటి ప్రాధాన్యత.. అన్ని విధాల సహాయ సహకారాలు అందిస్తామన్నారు. ఉచిత అడ్మిషన్స్ పొందడమే కాకుండా కష్టపడి చదవాలని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అడిషనల్ ఎస్పీ పేర్కొన్నారు. పోలీసుల సంక్షేమం కొరకు ఎంతో తోడ్పాటును అందిస్తున్న ఎస్పీకి జిల్లా పోలీసు అసోసియేషన్ ప్రెసిడెంట్ ప్రసాద్ ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలియజేశారు. ఉచిత సీట్ల కేటాయింపులో పారదర్శకంగా వ్యవహరించిన అధికారులు, జిల్లా పోలీసు అసోసియేషన్, ఇతరులను ఎస్పీ అభినందించగా, ఎంతో తోడ్పాటు అందించిన ఎస్పీకి కరతాళ ధ్వనులతో తల్లిదండ్రులు, విద్యార్థులు కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ సౌజన్య, ఏఓ చంద్రమౌళి, ఎస్బీ సీఐ-1 వెంకటేశ్వరరావు, వెల్ఫేర్ ఆర్ఐ రాజారావు, ఆర్ఐ అడ్మిన్ అంకమరావు, జిల్లా పోలీసు అసోసియేషన్ ప్రెసిడెంట్ మద్దిపాటి ప్రసాద్, అసోసియేషన్ సభ్యులు, పోలీసు అధికారులు, సిబ్బంది, పోలీసు పిల్లలు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# ప్రజలకు అనుకూలంగా రేషన్ షాపులు

### కూటమి ప్రభుత్వ నిర్ణయంపై హర్షాతిరేకాలు



**తోటపల్లి గూడూరు, మేజర్‌న్యూస్ :** తోటపల్లి గూడూరు మండలం కొత్తపాళెంలో నూతన రేషన్ షాపును సర్వేపల్లి టీడీపీ సమన్వయకర్త సోమిరెడ్డి రాజగోపాల్ రెడ్డి ప్రారంభించారు. టీడీపీ కూటమి ప్రభుత్వం ఈ నెల 1వ తేదీ నుంచి రేషన్ షాపుల వ్యవస్థను పునఃప్రారంభించిందని, ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోందని, ప్రజలు తమకు అనుకూలమైన సమయాల్లో వచ్చి సరుకులు తీసుకెళుతున్నారన్నారు. 42 ఏళ్లుగా ఉన్న రేషన్ షాపుల వ్యవస్థను గత వైసీపీ ప్రభుత్వం గందరగోళం చేసిందని, ఇంటింటికీ బియ్యం పంపిణీ పేరుతో రూ.11 వేలు కోట్లతో వ్యాన్లు కొనుగోలు చేసిందన్నారు. ఏ రోజూ కూడా ఆ వ్యాన్లు ఇంటింటికీ రాలేదు.. ఎక్కడో ఒక కూడలిలో కాసేపు వ్యాన్ ఉండేదన్నారు. ఆ సమయంలో సరుకులు తీసుకోని వారికి ఇక ఆ నెలలో లేనట్లేనన్నారు. ప్రజల సమస్యలను గుర్తించిన కూటమి ప్రభుత్వం పాత వ్యవస్థను పునరుద్ధరించిందని, సర్వేపల్లి నియోజకవర్గాన్ని సమగ్రంగా అభివృద్ధి చేసేందుకు ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి కంకణం కట్టుకున్నారన్నారు. పెండింగ్ సమస్యలన్నింటిని పరిష్కరించుకుంటూ ముందుకు వెళ్తున్నారన్నారు. ప్రధానంగా భూ సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి పెట్టారని, కొత్తపాళెంలో అసంపూర్తిగా నిలిచిపోయిన పంచాయతీ భవనాన్ని త్వరలోనే పూర్తి చేస్తామన్నారు. స్మశానానికి వెళ్లే రోడ్డును కూడా బాగు చేసేందుకు ఎమ్మెల్యే చర్యలు తీసుకుంటారని, తమపై నమ్మకంతో ఘన విజయాన్ని అందించిన సర్వేపల్లి ప్రజలకు రుణపడి ఉంటామన్నారు.

## అక్రమ మైనింగ్ కేసులో పోలీస్ కస్టడీకి కాకాణి గోవర్ధనరెడ్డి

### కృష్ణపట్నం పీఎస్‌లో విచారణ



**ముత్తుకూరు, మేజర్‌న్యూస్ :** అక్రమ మైనింగ్ కేసులో నిందితుడుగా ఉన్న మాజీ మంత్రి డాక్టర్ కాకాణి గోవర్ధన్ రెడ్డిని కోర్టు ఆదేశాల మేరకు పోలీస్ శాఖ కస్టడీకి తీసుకుంది. ఈ నేపథ్యంలో శుక్రవారం జిల్లా కేంద్రం కారాగారం నుంచి పోలీస్ శాఖ బందోబస్తు మధ్య ఆయనను కృష్ణపట్నం పోలీస్ స్టేషన్‌కు తరలించారు. మధ్యాహ్నం సమయానికి పోలీసులు ఆయనను పోలీస్ స్టేషన్‌కు తీసుకొచ్చారు. సంబంధిత అధికారులు న్యాయవాదుల సమక్షంలో విచారణ చేశారు. పోలీస్ కస్టడీలో అనేక ప్రశ్నలు వేసినట్టు సమాచారంగా ఉంది.

## త్యాగానికి ప్రతీక బక్రీద్



**నెల్లూరు, మేజర్‌న్యూస్ :** దానధర్మాలకు, త్యాగాలకు ప్రతీకగా నిలిచే బక్రీద్ సందర్భంగా ప్రతి ముస్లిం సోదరులపై అల్లా ఆశీసులు మెండుగా ఉండాలని నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డిలు ఆకాంక్షించారు. శనివారం వారం బక్రీద్ సందర్భంగా ముస్లిం సోదరీ సోదరులకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఉన్నదాంట్లోనే ఇతరులకు కొంచెం పంచిపెట్టే దాతృత్వ స్ఫూర్తిని బక్రీద్ చాటుతోందన్నారు. దేవునిపై విశ్వాసంతో సన్మార్గంలో జీవించాలని, బక్రీద్ పండగను భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలని ఆయన ఆకాంక్షించారు. కోవూరు ప్రజలపై, కూటమి ప్రభుత్వం, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుపై అల్లా ఆశీస్సులు మెండుగా ఉండాలని ఆమె అన్నారు.

### ముస్లిం సోదరులకు బక్రీద్ శుభాకాంక్షలు : ఎమ్మెల్సీ పర్వతరెడ్డి



**నెల్లూరు, మేజర్‌న్యూస్ :** త్యాగం, విధేయత, దేవునిపై నమ్మకానికి ప్రతీక బక్రీద్ పండుగ ఎంతో ప్రాముఖ్యత కలిగిన పవిత్రమైన ఈ పండుగ పర్వదినాన ప్రజల త్యాగాలను అల్లా గుర్తించి వారి కోర్కెలు నెరవేర్చాలని కోరుతూ ముస్లిం సోదర, సోదరీమణులకు ఎమ్మెల్సీ పర్వతరెడ్డి బక్రీద్ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ముస్లింలు ప్రతిఒక్కరు బక్రీద్ పండుగను సంతోషంగా జరుపుకోవాలని మనస్ఫూర్తిగా కోరుకున్నారు.

## చివరి దశకు చేరుకున్న వీఆర్సీ హైస్కూల్ ఆధునీకరణ పనులు



(మొదటి పేజీ తరువాయి)

అడిగి తెలుసుకున్నారు. ప్రతి తరగతి గదికి వెళ్లి ఏర్పాటు చేసిన వసతులను, ఫర్నిచర్ ను, ప్లే గ్రౌండ్‌ను పరిశీలించారు. పనులు నాణ్యవంతంగా వేగంగా చేస్తున్న ఎన్‌సీసీ సిబ్బందిని ఆమె అభినందించారు. ఈ సందర్భంగా పొంగూరు షరణి మాట్లాడుతూ.. వెంకటగిరి రాజా సహాయంతో వీఆర్సీని అభివృద్ధి చేశారన్నారు. 1975లో మహోన్నత ఉద్దేశంతో ఏర్పాటు చేసిన వీఆర్సీకి గొప్ప చరిత్ర ఉందని తెలిపారు. ఎంతో మంది ప్రజాప్రతినిధులను, వ్యాపార వేత్తలను, మేధావులను సమాజానికి అందించిందన్నారు. అంతటి చరిత్ర ఉన్న వీఆర్సీ హై స్కూల్‌ను వైఎస్సార్సీపీ హయాంలో మూత వేయడం దౌర్భాగ్యమని మండిపడ్డారు. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మంత్రి లోకేష్ సహకారంతో వీఆర్సీ పునః ప్రారంభానికి మా నాన్న నారాయణ సంకల్పించారని తెలియజేశారు. ఆ మేరకు ఆధునీకరణ పనుల బాధ్యత తనకు అప్పగించారని చెప్పారు. పేద విద్యార్థులకు ఇంటరాక్టివ్, డిజిటల్ విద్యను ఈ ఏడాది నుంచి అందించబోతున్నట్లు వెల్లడించారు. ఏపీని డిజిటల్ ఇండియా చేయాలన్నది మంత్రి లోకేష్ బాబు ఆశయం అని తెలియజేశారు. అంతర్జాతీయ ప్రమాణాలతో దేశంలోనే రోల్ మోడల్‌గా తీర్చిదిద్దుతున్నామన్నారు. ఇంటర్ నేషనల్ స్కూల్స్‌లో ఉండే స్టాండర్స్ ఇక్కడ ఉంటాయని చెప్పారు. పి4 కింద ఇరవై మంది విద్యార్థుల కుటుంబాలను దత్తత తీసుకొంటున్నానని ప్రకటించారు. పేదపిల్లల కోసం జరుగుతున్న యజ్ఞంలో భాగస్వామిని కావటం అదృష్టంగా భావిస్తున్నానని హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో స్థానిక టీడీపీ నేతలు, వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన నారాయణా విద్యాసంస్థల ఇంచార్జిలు, ఎన్సీసీ మేనేజర్‌లు పాల్గొన్నారు.

## అల్లాహ్ ఆశీస్సులు ప్రజలందరికీ ఉండాలి : మంత్రి నారాయణ



**నెల్లూరు అర్బన్/క్రైమ్, మేజర్‌న్యూస్ :** బక్రీద్ పండుగ సందర్భంగా ముస్లింలకు రాష్ట్ర పట్టణ పురపాలక శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ శుభాకాంక్షలు తెలిపారు. త్యాగం, సహనం.. ఈ రెండూ బక్రీద్ పండుగ ఇచ్చే సందేశాలని పేర్కొన్నారు. దైవ ప్రవక్త ఇబ్రహీం మహోన్నత త్యాగాన్ని స్మరించుకుంటూ బక్రీద్ పండగ జరుపుకుంటారని.. త్యాగనిరతికి బక్రీద్ పండుగ నిదర్శనమన్నారు. ధనిక, పేద అన్న తారతమ్యం లేకుండా రాగద్వేషాలకు అతీతంగా ముస్లింలందరూ భక్తిశ్రద్ధలతో చేసుకునే బక్రీద్ అని.. అల్లాహ్ ఆశీస్సులు ప్రజలందరికీ ఎల్లప్పుడూ ఉండాలని మంత్రి నారాయణ ఆకాంక్షించారు.

### ముస్లింలకు బక్రీద్ శుభాకాంక్షలు : మంత్రి ఆనం



**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** ముస్లిం సోదరులకు రాష్ట్ర దేవాదాయ శాఖా మంత్రి ఆనం రామనారాయణరెడ్డి బక్రీద్ శుభాకాంక్షలు తెలిపారు. త్యాగాలకు ప్రతీక అయిన ఈద్ అల్ అదా (బక్రీద్) పండుగను ముస్లీం సోదరులందరూ భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలని మంత్రి ఈ సందర్భంగా ఆకాంక్షించారు. ప్రతి ఒక్కరూ దేవునిపై విశ్వాసం ఉంచి సన్మార్గంలో జీవించాలని ఈద్ అల్ అదా తెలియజేస్తుందని, తమకు ఉన్నదాంట్లో నుంచి ఇతరులకు పంచి పెట్టే దాతృత్వ స్ఫూర్తిని బక్రీద్ కలుగజేస్తుందన్నారు. రాష్ట్రం లోని ముస్లింలందరూ ఈ పండుగను సంతోషంగా జరుపుకోవాలని.. ప్రజలపై, సీఎం చంద్రబాబుపై ఆ అల్లా ఆశీస్సులు మెండుగా ఉండాలని ఆకాంక్షించారు.

- ఫైనాన్స్ కంపెనీ వేధింపుల వల్లే రత్తయ్య బలవన్మరణం
- ఫైనాన్స్ కంపెనీ వ్యవహారశైలిపై ప్రభుత్వం దృష్టికి తీసుకువెళతాం
- ఎమ్మెల్యే సురేష్, గౌడ కార్పొరేషన్ చైర్మన్ వీరంకి

# గీత కార్మికుడి కుటుంబాన్ని ఆదుకుంటాం

**జలదంకి, మేజర్‌న్యూస్ :** ఫైనాన్స్ కంపెనీల ఆగడాలు రోజురోజుకు శృతి మీరుతున్నాయని, ఫైనాన్స్ కంపెనీ ఒత్తిడిని తట్టుకోలేక, ఆర్థిక సమస్యలతో కొట్టుమిట్టాడుతూ గీతకార్మికుడు బలవర్మణం పాలవటం అత్యంత బాధాకర మని, దురదృష్టకరమని, బాధిత కుటుంబానికి అన్ని విధాలా అండగా ఉంటామని ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్, రాష్ట్ర గౌడ వెల్ఫేర్, డెవల ప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ వీరంకి వెంకట గురుమూర్తిలు భరోసా ఇచ్చారు. నెల్లూరు జిల్లా కలిగిరి మండలం భట్టువారిపాలెంకు చెందిన కొమరా రత్తయ్య (38) ఫైనాన్స్ కంపెనీ ఒత్తిళ్లను తట్టుకోలేక సోమవారం ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. జలదంకి మండలం, చామదల పంచా యతీ పరిధిలోని వేణుగోపాలపురంకు చెందిన రత్తయ్య కుటుంబం 30 ఏళ్ల క్రితం భట్టువారిపాలెంకు వలస వచ్చి కల్లుగీత వృత్తి సాగిస్తూ జీవనం సాగిస్తున్నాడు. రత్తయ్యకు భార్య, ఒక కుమార్తె, ఒక కుమారుడు సంతానం ఉన్నారు. ఈ క్రమంలో కుటుంబ ఆర్థిక అవసరాల దృష్ట్యా మూడేళ్ల క్రితం రత్తయ్య ఓ ప్రైవేట్ ఫైనాన్స్ కంపెనీలో రూ.3.25లక్షలు వాయిదాల పద్ధతి లో చెల్లించేందుకు అప్పుగా తీసుకున్నాడు. కొంతకాలం సకాలంలో వాయి దాలు చెల్లిస్తూ వచ్చాడు. తన భార్యకు ఆరోగ్య సమస్యలు ఉత్పన్నం కావటం తోపాటు కుటుంబ ఆర్థిక పరిస్థితులు అంతంతమాత్రంగా మారడంతో ఎనిమిది నెలలుగా రత్తయ్య వాయిదాలు చెల్లించలేదు. దీంతో ఫైనాన్స్ కంపెనీ సిబ్బంది రత్తయ్యపై ఒత్తిడి చేశారు. అంతటితో ఆగక అతని ఇంటి గోడపై తమ కంపెనీకి రత్తయ్య బాకీ ఉన్నట్టు నోటీసులు అంటించారు. వాయిదా చెల్లించాల్సిందేనంటూ పట్టుబడ్డారు. ఈ క్రమంలో తన నివాసా నికి సమీపంలో ఉన్న బంధువైన వృద్ధురాలి పెన్షన్ రూ.4వేలు, ఆమె తన యుడు వద్ద రూ.2వేలు అప్పు తీసుకుని ఫైనాన్స్ సిబ్బందికి చెల్లించాడు. అయినా, మిగిలిన నగదు చెల్లించాలంటూ సిబ్బంది మరింత ఒత్తిడి తీసుకు రావటంతో తీవ్ర మనోవేదనకు గురైన రత్తయ్య తన ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. రత్తయ్య మృతదేహాన్ని కుటుంబసభ్యులు, బంధువులు స్వగ్రామం వేణుగోపాలపురంకు తీసుకువెళ్లి అంత్యక్రియలు నిర్వహించారు. ఈ మేరకు సమాచారం తెలుసుకున్న ఉదయగిరి ఎమ్మెల్యే సురేష్, గౌడ కార్పొరేషన్ చైర్మన్ గురుమూర్తిలు శుక్రవారం వేణుగోపాల పురం వెళ్లి బాధిత కటుంబసభ్యులను పరామర్శించారు. రత్తయ్య చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సురేష్, గౌడ కార్పొరేషన్ చైర్మన్ గురుమూర్తి లు రత్తయ్య మృతిపట్ల తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. ఫైనాన్స్ కంపెనీ తీరుపై మండిపడ్డారు. ఫైనాన్స్ కంపెనీ వేధింపుల వల్లే రత్తయ్య బలవన్మరణం చెందాడని, ఫైనాన్స్ కంపెనీ వ్యవహారశైలిని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి బాధిత కుటుంబానికి న్యాయం జరిగేలా అన్ని విధాలా అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఆడపిల్ల పేరున కాకర్ల ట్రస్ట్ తరపున కాకర్ల సురేష్ రూ.50వేలు రత్తయ్య కుటుంబానికి తనవంతు సాయంగా గౌడ కార్పొరేషన్ చైర్మన్ గురుమూర్తి రూ.25వేలు, గౌడ సంక్షేమ సంఘం తరపున రూ.75 వేలు వెరసి రూ.1లక్ష రత్తయ్య కుమార్తె పేరును బ్యాంకులో వెంటనే ఫిక్సిడ్ డిపాజిట్ చేస్తామని భరోసా ఇచ్చారు. అలాగే, విషయాన్ని సీఎం చంద్రబాబు



నాయుడు దృష్టికి తీసుకువెళ్లి పార్టీపరంగా, ప్రభుత్వపరంగా కుటుంబానికి ఆర్థికసాయం అందేలా చూస్తామని, రత్తయ్య కుమారుడు, కుమార్తె విద్యకు, మానసిక రోగంతో బాధపడుతున్న రత్తయ్య భార్యకు వైద్యం అందించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటామని బాధిత కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే సురేష్, గౌడ కార్పొరేషన్ చైర్మన్ గురుమూర్తిలు భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ మధుమోహన్ రెడ్డి, క్లస్టర్ ఇన్‌చార్జ భాస్కర్ రెడ్డి, జలదంకి మండల తెలుగు యువత అధ్యక్షులు మునగాల తిరుమల రెడ్డి, టీడీపి సీనియర్ నాయకులు మునగాల వెంకటేశ్వర్ల రెడ్డి, జంపాని వంశీ గౌడ్, మోర్ల సురేష్ గౌడ్, ఉప్పాల శ్రీను గౌడ్, ఉప్పాల వెంకట్రావు గౌడ్ కోసూరి వెంకటేశ్వర్లు గౌడ్, రవి గౌడ్, తుళ్లూరు శ్రీనువాసులు గౌడ్, ఉప్పాల దినేష్ పంది పెంచలయ్య తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్మార్పిఎస్, ఎంఎస్పీ గ్రామ కమిటీల ఏర్పాటు వేగవంతం చేయాలి

**జిల్లా ఇన్‌చార్జ్ మంద వెంకటేశ్వరరావు మాదిగ పిలుపు**



**నెల్లూరు/వేదాయపాళెం, మేజర్‌న్యూస్ :** జిల్లా వ్యాప్తంగా ఎమ్మార్పిఎస్ ఎంఎస్పీ గ్రామ కమిటీల ఏర్పాటు వేగవంతం చేయాలని జిల్లా ఇన్‌చార్జ్ మంద వెంకటేశ్వరరావు మాదిగ పిలుపునిచ్చారు. పద్మశ్రీ మంద కృష్ణమాదిగ ఆదేశానుసారం ఎమ్మార్పిఎస్ జిల్లా అధ్యక్షుడు సూరిపాక ఉదయకృష్ణ మాదిగ ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక కొండాయపాళెం కూడలిలో ఉన్న డాక్టర్ అంబేద్కర్భవన్ నందు ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో పాల్గొన్న జిల్లా ఇన్‌చార్జ్ మంద వెంకటేశ్వరరావు మాదిగ మాట్లాడుతూ.. ఎస్సీ వర్గీకరణ సాధనకై 30 ఏళ్లపాటు అలుపెరుగని పోరాటాలు చేసిన కృషి ఫలితంగా సత్ఫలితం దక్కిందని, ఎస్సీ వర్గీకరణ ఫలాలు నేడో.. రేపో యావత్ మాదిగల తోపాటు ఉపకులాలకు అందబో తున్నాయన్నారు. భవిష్యత్‌లో మాదిగలు మరింత సాధికారతతో ముందుకెళ్లేందుకు ఎమ్మార్పిఎస్ ఉద్యమాన్ని గ్రామస్థాయిలో మరింత బలోపేత మైన శక్తిగా తయారు చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఈ పరిస్థితుల్లో ప్రతి ఎమ్మార్పిఎస్.. ఎంఎస్పీ నాయకుడు గ్రామ కమిటీల ఏర్పాటు వేగవంతం చేసే పనిలో ఉండాలని, మాదిగ విద్యార్థులు, యువతను ఉద్యమంలో భాగస్వాములను చేసే దిశగా నూతన ఇన్‌చార్జ్‌లను నియవి ంచడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఎస్పీ జిల్లా అధ్యక్షుడు పందిటి అంబేద్కర్మాదిగ, రాష్ట్రనాయ కుడు గోచిపాతల వెంకటేశ్వర్లు మాదిగ, ఎంఈఎఫ్ జిల్లా అధ్యక్షుడు కొప్పర్తి కొండయ్య మాదిగ, జాతీయ నాయకుడు బెజవాడ పాపయ్య మాదిగ. రాష్ట్రనాయకుడు వేగూరు వెంకటె శ్వర్లు మాదిగ, ఎంఎస్పీ మహిళా విభాగం ఇన్చార్జి గేరా జానకీమాల, సీనియర్ నాయకుడు తాళ్లూరు శేషయ్యమాదిగ, నియోజకవర్గాల ఇన్‌చార్జ్‌లు సిద్ధవరపు పెంచలయ్యమాదిగ, కొమరిక రమణయ్యమాదిగ, చింతగుంట అంకయ్య మాదిగ, అక్కిలగుంట ఏసుమాదిగ, గొల్లపల్లి మోహన్ రావుమాదిగ, గంగపట్ల సింహాద్రి మాదిగ, కొత్తపల్లి మాతయ్యమాదిగ, గోసాల సుధాకర్ మాదిగ, వడ్లపల్లి రమణమ్మమాదిగ. ఎస్ స్వర్ణలతమాదిగ, ఎం.విజయలక్ష్మిమాదిగ, గోచిపాతల ఆనందరావుమాదిగ, కావలి శ్రీనివాస్మాదిగ, దండు భార్గవ్మాదిగ, కుర్రా మల్లిఖార్జున మాదిగ, దరి గుంటవాసుమాదిగ, నాగరాజు మాదిగ, గంగపట్ల నాగరాజుమాదిగ, పల్లాల కుమారిమాదిగ, ఇండ్ల మురళి మాదిగ, ఎస్.హరిబాబుమాదిగ, గంగపట్ల ప్రకాష్ మాదిగ, ఎమ్మార్పిఎస్, ఎంఎస్పీ ఎంఈఎఫ్, ఎంఎంఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఘనంగా కామ్రేడ్ పెరుమాళ్లు వర్ధంతి వేడుకలు



**నెల్లూరు/వేదాయపాళెం, మేజర్‌న్యూస్ :** నగరంలోని టైలర్స్ కాలనీలో శుక్ర వారం ఐఎఫ్టియు టైలర్స్ యూనియన్, ప్రగతిశీల మహిళా సంఘం, పిడిఎసు సంయుక్త ఆధ్వర్యంలో కామ్రేడ్ పెరుమాళ్లు స్థూపం వద్ద 18వ వర్ధంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ.. విప్లవ కమ్యూనిస్టు, టైలరారీనియన్ను కార్మికవర్గ రాష్ట్ర నాయకుడు కామ్రేడ్ మంచకులపాటి పెరుమాళ్లు ఆశయాలను కొ నసాగిద్దాం.. అంటూ ప్రతిజ్ఞ చేశారు. అనంతరం ఐఎఫ్టియు జిల్లా అధ్యక్షుడు సిఎస్ సాగర్ మాట్లాడుతూ.. టైలర్స్ కాలనీ నిర్మాణం కోసం కామ్రేడ్ ఎరుమాళ్లు ఎంతో కృషి చేశారని. అలాగే కార్మిక హక్కుల సాధన కోసం అలుపెరుగని పోరాటాలు. ఎన్నో త్యాగాలు చేశారన్నారు. ప్రతి ఒక్కరూ కామ్రేడ్ పెరుమాళ్లు విప్లవబాటలో పయనించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్రనాయకులు మురళీరేఖ బాబు, షేక్ మదార్, గులాం, రీజంబ్బాబు, శివాని శీనయ్య, కమ్రుద్దీన్, యానాదయ్య, బాలాజి శీనయ్య, వేట మురళి, పిడబ్ల్యూ నాయకులు వసంతమ్మ, సరోజిని, శ్యామల, పిడిఎసు జిల్లా అధ్యక్షుడు ఎం.సునీల్ తదితరులు పాల్గొన్నారు.

నెల్లూరు కేంద్ర సహకార బ్యాంక్..

# చైర్మన్ ప్రమాణ స్వీకారోత్సవం



**వింజమూరు, మేజర్‌న్యూస్ :** నెల్లూరు కేంద్ర సహకార బ్యాంక్ నూతన చైర్మన్‌గా శు క్ర వారం ప్రమాణ స్వీకారం చేశారు. ఈ ప్రమాణ స్వీకా రోత్సవానికి వింజమూరు సెంట్రల్ బ్యాంక్ చీఫ్ మేనేజర్ ఏ రామనారాయణ సొసైటీ సీఈవో మేకల రమణయ్య గరిమన పెంట సీఈవో పి.వెంకటేశ్వర్లు సెంట్రల్ బ్యాంక్ డైరెక్టర్ యారవ కృష్ణయ్య సొసైటీ సిబ్బంది ముక్కామల శ్రీనివాసరెడ్డిలు హాజరై ఆయనకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా మీరు భవిష్యత్తులో మరెన్నో ఉన్నత పదవులను అలంకరించాలని ఆకాంక్షించారు.

## మండల స్థాయిలో ఏడుషైనింగ్ స్టార్స్ ప్రతిభ అవార్డులు




**వింజమూరు, మేజర్‌న్యూస్ :** వింజమూరు మండల స్థాయిలో ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలలో సంబంధించిన ఏడుగురు విద్యార్థులు షైనింగ్ స్టార్స్ ప్రతిభ అవార్డులను పొందాలని ఎంఈఓ మధుసూదన్ రెడ్డి తెలిపారు. వింజ మూరు నారాయణ పాఠశాల విద్యార్థులు 595 మార్కులు సాధించిన మద్దసాని దేవి చరణ్ వీర వెంకట సాయి సంతోష్ నల్లగొండ సాయి కృష్ణ 593 మార్కులతో వెంకట శేష సాయి, ఏలూరు లక్ష్మి ప్రవీణ రెడ్డి 591 మార్కులతో సిహెచ్ కార్తికేయ 586మార్కులు సరస్వతీ పాఠశాలకు చెందిన విద్యార్థి బాలుర ఉన్నత పాఠశాలకు చెందిన గంగవరపు జ్ఞాపిక 593 మార్కులతో ప్రతిభ అవార్డులను పొందారు వీరిని ఆయా పాఠశాలల యాజమాన్యం, ఉపాధ్యాయ బృందం అభినందించారు.

## భూమిపూజ మహోత్సవానికి తట్టవర్తికి ఆహ్వానం

**కావలి, మేజర్‌న్యూస్ :** పెనుగొండ క్షేత్ర పీఠాధిపతి బాల స్వామీజీ సరస్వతి దేవాలయ భూమి పూజ మహోత్సవ కార్యక్రమం తెనాలిలో శనివారం జరుగు భూమిపూజ మహోత్సవం కార్యక్రమానికి కావలి ఆర్యవైశ్య పట్టణ అధ్యక్షులు రమేష్‌ను పీఠాధిపతి బాలస్వామీజీ ఆహ్వానించారు. అలాగే తటవర్తి రమేష్, వారి మిత్రబృందం కూడా ఈ కార్యక్రమంలో పాలు పంచుకోవాలని వారి మిత్ర బృందానికి కూడా ఆహ్వాన పత్రికతో ఆహ్వానించారు. అనంతరం ఆర్యవైశ్య నాయకులు పట్టణ అధ్యక్షులు తటవర్తి రమేష్ మాట్లాడుతూ.. ఈ భూమి పూజ కార్యక్రమానికి ఆహ్వానించడం ఎంతో సంతోషంగా ఉందని తెలిపారు.

# మన విద్యుత్ పంపిణీ సంస్థ.. మనందరి భాద్యత

- పెండింగ్ వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు..
- యుద్ధప్రాతిపదికన మంజూరు చేయాలి
- క్రీపర్‌ను వెంటనే తొలగించాలి
- సిబ్బంది ఆయా హెడ్ క్వార్టర్స్‌లోనే నివాసాలు ఉండాలి
- టెలీకాన్ఫరెన్స్‌లో ఉమ్మడి జిల్లా పర్యవేక్షక ఇంజనీరు విజయన్



**నెల్లూరు/వేదాయపాళెం, మేజర్‌న్యూస్ :** ప్రజల నిత్యవసరంలో భాగమైన 'మన విద్యుత్ పంపిణీ సంస్థ అభివృద్ధి.. మనందరి భాద్యత' అన్న నినాదం ప్రతి ఉద్యోగికీ ఆచరణీయం కావాలని.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలులోకి తెచ్చిన 'సోలార్ విద్యుత్ను -ఉపయోగిద్దాం.. విజన్-2047లో భాగస్వాములవుదాం 'అన్న నినాదం అధికారులు, సిబ్బందితోపాటు సొంత ఇళ్లు కలిగిన ప్రతి వినియోగదారునికీ ఆచరణీయం కావాలని విద్యుత్శాఖ పర్యవేక్షక ఇంజనీరు విజయన్ పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక విద్యుత్ భవన్ నుంచి ఉమ్మడి నెల్లూరు జిల్లాలోని ఇంజనీరింగ్, సూర్యఘర్ పథకం, టెక్నికల్ విభాగాల అధికారులతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించిన సూపరిండెంటింగ్ ఇంజనీరు విజయన్ మాట్లాడుతూ.. ఏపీ దక్షిణప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ ఉమ్మడి నెల్లూరు జిల్లాల్లోని రైతులకు పెండింగ్లో ఉన్న వ్యవసాయ విద్యుత్ సర్వీసు కనెక్షన్లు యుద్ధప్రాతిపదికన మంజూరు చేయాలని ఆదేశించారు. పెండింగ్లో ఉన్న వ్యవసాయ విద్యుత్ సర్వీసు కనెక్షన్లు మంజూరు చేసేందుకు అవసరమైన మెటీరియల్ అంతా సిద్ధంగా ఉందని, వెంటనే పనులు ప్రారంభించాలని సూచించారు. విద్యుత్ సరఫరాలో వినియోగదారులకు అనే కర్యం కలుగకుండా అంతరాయ రహిత సేవలందించాలని, అభివృద్ధి పనుల నిమిత్తం విద్యుత్ అంతరాయం ఏర్పడే సందర్భంలో ముందస్తు పత్రిక ప్రకటన ద్వారా ప్రజలకు సమాచారం ఇవ్వాలని ఆదేశించారు. అలాగే పిఎం సూర్య ఘర్ పథకం, ఆర్డిఎస్ఎస్ పనుల ప్రక్రియలు వేగవంతం చేయాలన్నారు. ఉన్నతాధికారుల నుంచి కింది స్థాయి సిబ్బంది వరకు భాధ్యతగా తీసుకొని పిఎం సూర్యఘర్ పథకం వల్ల చేకూరే ప్రయోజనాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని, పునరుత్పాధక విద్యుత్ను ప్రోత్సహించాలని, పెండింగ్లో ఉన్నవర్క్ ఆర్డర్ను సంబందిత అసిస్టెంట్ ఇంజనీర్లు వెంటనే క్లోజ్ చేయాలన్నారు. విద్యుత్ సిబ్బందికి నిర్దేశించిన హెడ్ క్వార్టర్స్‌లోనే నివాసాలు ఉండాలని. స్థానికంగా అందుబాటులో ఉంటూ మెరుగైన విద్యుత్ సేవలందించాలని సూచించారు. విద్యుత్ సమస్యల పరిష్కారం, సందేహాల నివృత్తి, ఇతరత్రా కార్యాలయ సేవలనిమిత్తం వచ్చే ప్రజలు, వినియోగదారుల పట్ల గౌరవంగా వ్యవహరించాలని, పదేపదే కార్యాలయాల చుట్టూ ప్రదక్షణలు చె యించకుండా.. సహనంతో సమస్యను తెలుసుకొని ఎన్నిరోజుల్లో సమస్యను పరిష్కరిస్తారో స్పష్టమైన సమాధానం ఇవ్వాలని సూచించారు.వి ద్యుత్ పోల్స్కు అలుకొని ఉన్న క్రీపర్స్ను వెంటనే తొలగించాలని, ముఖ్యంగా పగటిపూట విద్యుత్ దీపాలు వెలగకుండా చర్యలు తీసుకునేందుకు రెండు నెలల గడువు ఇస్తున్నానని, రెండు మాసాల్లో తానే స్వయంగా తనిఖీలు చేయడం జరుగుతుందని, ఎక్కడైనా విద్యుత్ స్థంబాలకు క్రీపర్స్ అలుకొని ఉన్నట్లు గుర్తిస్తే సంబందిత అధికారిపై చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. క్షేత్రస్థాయిలో ట్రాన్స్ ఫార్మర్స్ ఫెయిల్యూర్స్ ఎక్కువగా కనిపిస్తుందని, ప్రతి అధికారి తనిఖీలు చేసి ట్రాన్స్ ఫార్మర్స్ కాలిపోయేందుకు కారణాలను తెలుసుకొని సరిచె యాలన్నారు. విద్యుత్ పరంగా ఎలాంటి సమస్యనైనా పరిష్కరించుకునేందుకు వాట్సాఫ్ నెంబరు 9133331912కు సమాచారం అందించాలని, రాష్ట్రప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అందుబాటులోకి తెచ్చిన వాట్సాప్ గవర్నెన్స్ నెంబరు 9552300009ను సద్వినియోగం చేసుకొని మరిన్ని రకాల విద్యుత్ సేవలు పొందాలని సూచించారు. ఏపీ దక్షిణప్రాంత విద్యుత్ పంపిణీ సంస, ఉమ్మడి జిల్లాల్లో 50 వేల సోలార్ విద్యుత్ కనెక్షన్లు నమోదు లక్ష్యంగా అధికారులు పనిచేయాలని సూచించారు.

ప్రధానమంత్రి సూర్యఘర్ ముస్తీ యోజన పథకంపై ప్రజల్లో అవగాహన పెంపొందించేందుకు విస్తృతంగా కార్యక్రమాలు చేపట్టాలని, రిజిస్ట్రేషన్ల సంఖ్యను గణనీయంగా పెంచాలన్నారు. ప్రధానంగా బీసీ వినియోగదారులకు కేంద్రప్రభుత్వం ఇచ్చే రూ. 78వేల రాయితీతోపాటు ఏపీ రాష్ట్ర ప్రభుత్వం అదనంగా రూ. 20వేల సబ్సిడీ ఇస్తుందన్నారు. ఈనేపథ్యంలో బీసీ వినియోగదారుల నుంచి కూడా వీలైనంత ఎక్కువ సంఖ్యలో రిజిస్ట్రేషన్లు నమోదు చేయించాలని ఆదేశించారు. విజన్ 2047 లక్ష్యసాధనలో భాగంగా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న సోలార్ (సౌర) విద్యుత్ సేవలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. ఈకార్యక్రమంలో సీనియర్ అకౌంట్స్ ఆఫీసర్ మురళి, ఉమ్మడి నెల్లూరు జిల్లాల్లోని ఇంజనీరింగ్, సూర్యఘర్ పథకం, టెక్నికల్ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

## ఎన్ఎంఎంఎస్‌కు విద్యార్థులు ఎంపిక







**మర్రిపాడు, మేజర్‌న్యూస్ :** మర్రిపాడు మండలంలోని నందవరం ఆదర్శ పాఠశాలలోని ఐదు మంది విద్యార్థులు ఎన్ఎంఎంఎస్‌కు శుక్రవారం ఎంపికయ్యారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతూ కేంద్ర ప్రభుత్వం నిర్వహించే నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్షిప్ (ఎన్ఎంఎంఎస్)కు ఒకే పాఠశాల నుంచి ఐదు మంది విద్యార్థులు ఎంపిక కావడం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఆదర్శ పాఠశాలలో ఎనిమిదో తరగతి చదువుతూ కే సంజనా లాస్య, ఎంవి రోషిని, షేక్ సనా, ఎల్ ద్రాక్షాయిని, కే.శివకృష్ణలు పరీక్ష రాసి ఈ స్కాలర్షిప్ కు ఎంపికయ్యారు. ఎనిమిదవ తరగతి పూర్తి చేసిన విద్యార్థులు రాసిన ఈ పరీక్షలో మెరిట్ సాధించిన వారికి ఇంటర్ పూర్తయ్యే వరకు కేంద్ర ప్రభుత్వం ఆర్థిక సాయం అందిస్తుందని ప్రిన్సిపాల్ లక్ష్మీ నారాయణ తెలిపారు.

ఈ మెరిట్ స్కాలర్షిప్‌కు ఎంపికైన విద్యార్థులను పాఠశాల ఉపాధ్యాయులతో పాటు తల్లిదండ్రులు అభినందనలు తెలిపారు.

## నియోజకవర్గంలో మంత్రి కందుల దుర్గేష్ పర్యటించాలి



**జలదంకి, మేజర్‌న్యూస్ :** సినిమాటోగ్రఫీ, టూరిజం మంత్రి కందుల దుర్గేష్ శుక్రవారం కావలిలో ఓ కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఉదయగిరి నియోజకవర్గ జనసేన పార్టీ సమన్వయకర్త కొట్టే వెంకటేశ్వర్లు, ఉదయగిరి నియోజకవర్గ నేత నిమ్మలపల్లి రామచైతన్యలు మంత్రిని మర్యాదపూర్వకంగా కలిసి, శాలువాలతో సత్కరించారు. ఉదయగిరి కోట, పర్యాటక ప్రాంతాలలో పర్యటించాల్సిందిగా మంత్రిని వీరు కోరారు. ఉదయగిరి కోటతోపాటు, పర్యాటక ప్రదేశాలను అభివృద్ధి చేయాలని మంత్రికి విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో జలదంకి మండల జనసేన పార్టీ అధ్యక్షులు తోట మురళి, వరికుంటపాడు మండల పార్టీ అధ్యక్షులు రసూల్ పఠాన్, నాయకులు కమతం శ్రీను, రఘు, మాధవరావు తదితరులు పాల్గొన్నారు.

## వధూవరులను ఆశీర్వదించిన ప్రసన్నకుమార్ రెడ్డి



**ఇందుకూరుపేట, మేజర్‌న్యూస్ :** ఇందుకూరుపేట మండలం కొమరిక గ్రామం లోని శివాలయం నందు మాజీ సర్పంచ్ బండ్ల సుదర్శనమ్మ బండ్ల జనార్దన్ కుమారుడు మోహన్ పావనిల కళ్యాణ మహోత్సవంలో మాజీ మంత్రి వైసీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి, ఇందుకూరుపేట మండల అధ్యక్షులు మావులూరు శ్రీనివాసులురెడ్డిలు నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలోఏపీ ఎల్‌డిఏ చైర్మన్ గొల్లపలి విజయ్ కుమార్, బటేపాటి నరేంద్ర రెడ్డి, కొండ్లపూడి శ్రీనివాసులు రెడ్డి, గూడూరు ప్రభాకర్ రెడ్డి, గూడూరు శివకుమార్ రెడ్డి పాల్గొన్నారు.

### 10వ తరగతి ఫలితాల మూల్యాంకనంలో..

# జరిగిన అవకతవకలపై చర్యలు తీసుకోవాలి

### ఆశ్రిత్ రెడ్డి డీఈఓకు వినతి



**నెల్లూరు, మేజర్‌న్యూస్ :** పదవ తరగతి మూల్యాంకన లోపాలకు బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ నెల్లూరు జిల్లా వైసీపీ విద్యార్థి విభాగం అధ్యక్షుడు ఆశ్రీత్‌రెడ్డి శుక్రవారం జిల్లా విద్యాశాఖ అధికారికి వినతిపత్రం అందచేశారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ.. ఎన్నడూ లేని విధంగా పదవ తరగతి పరీక్షల నిర్వహణలో ఇటు పాలకులు, అటు సంబంధిత విద్యా శాఖ అధికారులు పూర్తిగా ఫెయిల్ అయ్యారని విమర్శించారు. 6.14లక్షల మంది రాత్రీ పగలూ కష్టపడి చదివి పరీక్షలు రాస్తే, జవాబు పత్రాలను సరిగ్గా దిద్ది, పారదర్శకంగా ఫలితాలు వెల్లడించకుండా ఘోరంగా విఫలమై, విద్యార్థులను వారి తల్లిదండ్రులను అంతులేని మానసిక క్షోభకు గురిచేశారు. ఫలితంగా ఇప్పుడు ప్రతి స్టూడెంట్ కూడా తన మార్కుల జాబితాపై అనుమానాలు వ్యక్తం చేసే పరిస్థితిని తీసుకు వచ్చారని ఆరోపించారు. ఈ కారణంగా ట్రిపుల్ ఐఐటీ, గురుకుల జూనియర్ కాలేజీలు సహా ఇతరత్రా అడ్మిషన్లలో విద్యార్థులు అన్యాయమై పోయిన ఘటనలు రాష్ట్ర వ్యాప్తంగా ఒక్కొక్కటిగా వెలుగులోకి వస్తున్నాయని చెప్పారు. ప్రభుత్వ నిర్వాకం వలన జరిగిన ఈ తప్పిదానికి విద్యార్థులు బలైపోవడానికి వీల్లేదు. దీన్ని దృష్టిలో ఉంచుకుని ఎలాంటి ఫీజు లేకుండా కోరిన ప్రతి విద్యార్థి జవాబు పత్రాలను రీవాల్యుయేషన్ చేయాలని డిమాండ్ చేశారు. తుది ఫలితాలు వచ్చేంతవరకూ టెన్త్ మార్క్స్ ప్రాతిపదికగా చేస్తున్న అడ్మిషన్లను కొన్నిరోజులపాటు నిలిపివేయాలని కోరారు. తప్పులకు బాధ్యులైన విద్యాశాఖ మంత్రి లోకేష్‌తో మొదలు అందరిపైనా చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ విద్యార్థి విభాగం నెల్లూరు రూరల్ అధ్యక్షుడు రోహిత్ రెడ్డి, కావలి అధ్యక్షుడు శ్యామ్, సర్వేపల్లి అధ్యక్షుడు హేమంత్, సూళ్లూరుపేట అధ్యక్షుడు తేజ, ఇతర విద్యార్థి నాయకులు పాల్గొన్నారు.

# శంకర్ నేత్రాలయ ఉచిత కంటి వైద్య శిబిరం ప్రారంభం




**వింజమూరు, మేజర్‌న్యూస్ :** నియోజకవర్గంలోని అతిపెద్దదైన వింజమూరు గ్రామానికి చెందిన ఎన్ఆర్ఐ శేగు సతీష్, శేగు సుబ్బారావు, నిర్మల కుటుంబ సభ్యుల దాతృత్వంతో వింజమూరులో శుక్రవారం వైఆర్ జూనియర్ కళాశాలలో ఉదయగిరి నియోజకవర్గ ఎమ్మెల్యే కాకర్ల సురేష్ శంకర నేత్రాలయ చెన్నై వారి ఉచిత కంటి శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రారంభోత్సవ సమావేశానికి ఏబీఆర్ ఎస్ఎం రాష్ట్ర అధ్యక్షుడు, శ్రీ వెంకటేశ్వర విశ్వ విద్యాలయం ప్రొఫెసర్ వై.రామిరెడ్డి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా కాకర్ల సురేష్ మాట్లాడుతూ.. ఉదయగిరి నియోజకవర్గంలోని గ్రామీణ ప్రాంతంలో ప్రపంచ ప్రఖ్యాత శంకర నేత్రాలయ ఈ రకమైన ఉచిత కంటి శిబిరాన్ని నిర్వహించడం వృద్ధులకు, పేద ప్రజలకు గొప్ప సహాయం అని అన్నారు. మొబైల్ ఆపరేషన్ థియేటర్లలో దృష్టిని తనిఖీ చేయడం, అక్కడికక్కడే శస్త్రచికిత్సలు చేయడం భారతదేశం లోని ఆధునిక వైద్య సాంకేతికతకు నిదర్శనం అని పేర్కొన్నారు. వైద్య శిబిరం దాత శేగు సుబ్బారావు మాట్లాడుతూ.. జననీ జన్మభూమిశ్చ స్వర్గాదపీ గరీయసి అన్న విధంగా పుట్టిన ఊరికి కొన్ని సేవా కార్యక్రమాలు చేయడానికి వారి కుటుంబానికి ఒక గొప్ప అవకాశం అని, భవిష్యత్తులో కూడా ఇలాంటి సేవా కార్యక్రమాలు చేపడతామని అన్నారు. వైద్య శిబిరం ప్రధాన నిర్వాహకుడు యల్లల రఘు రామిరెడ్డి మాట్లాడుతూ.. కంటి శిబిరం జూన్ 6 నుండి జూన్ 14 వరకు కొనసాగుతుందని, ప్రజల ఆదరణ, అవసరం ఎక్కువ ఉంటే మరిన్ని రోజులు ఈ కంటి శిబిరాన్ని కొనసాగిస్తామని, వింజమూరులో జరిగే ఈ ఉచిత వైద్య కంటి శిబిరాన్ని 1000మందికిపైగా పేదలు ఉపయోగించుకుంటారని ఆశిస్తున్నట్లు చెప్పారు. శంకర్ నేత్రాలయ ప్రజా సంబంధాల అధికారి డాక్టర్ రంజిత్ మాట్లాడుతూ.. అధునాతన కంటి సాంకేతిక పరిజ్ఞానాన్ని కలిగివున్న మొబైల్ వాహనాల ఆపరేషన్ థియేటర్ల ద్వారా అవసరమైన వారికి ఉచిత కంటి శస్త్రచికిత్సలు అక్కడికక్కడే చేయబడతాయని చెప్పారు. గ్రామంలోని పెద్దలు ప్రజాప్రతినిధులు వనిపెంట సుబ్బారెడ్డి, గణపం బాలకృష్ణారెడ్డి, గురిజాల వెంకట రమణయ్య, డాక్టర్ మసిలామణి, నల్లగొండ్ల సుజాత, వైఆర్ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ పద్మనాభం తదితరులు సమావేశంలో పాల్గొన్నారు. ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం (ఏపీయూఎస్)కు చెందిన ఉపాధ్యాయులు వెంగయ్య, శ్రీనివాసులు, తిరుపాలు, కొండా రెడ్డి, చలమయ్య, సుబ్బారెడ్డి, నాగేశ్వర్ రెడ్డి, భోజనపు గోపి నిర్వాహక బృందంగా పనిచేశారు.

# రేష్మ హోటల్ గౌస్‌కి సత్కారం : నూరుభాష సంఘం



**నెల్లూరు రూరల్, మేజర్‌న్యూస్ :** నెల్లూరు టౌన్ హాల్ నందు జరిగిన నూరుభాష విద్యార్థిని విద్యార్థుల ప్రతిభ ప్రోత్సాహక బహుమతులు కార్యక్రమం సందర్భంగా రాష్ట్రం నలుమూలల నుండి విచ్చేసిన నూరుభాష నాయకులకు, విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు దాదాపు 1000 మందికి నెల్లూరు రూరల్ నియోజకవర్గంలోని హోటల్ రేష్మ అధినేత షేక్ గౌస్ టౌన్ హాల్ నందు మధ్యాహ్నం, వారి హోటల్ నుండి బిర్యానీ తెప్పించి భోజనాలు పెట్టడం జరిగింది. ఈ సందర్భంగా షేక్ గౌస్‌కు నెల్లూరు నూరుభాష సంఘం తరపున వారికి ప్రత్యేక సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా షేక్ గౌస్ మాట్లాడుతూ.. భవిష్యత్‌లో నూరుభాష సంఘానికి తగిన సహాయ సహకారాలను అందిస్తానని తెలియచేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో నూరుభాష జిల్లా అధ్యక్షులు షేక్ సలీమ్, గౌరవ అధ్యక్షులు షేక్ మహబూబ్ బాషా, ప్రధాన కార్యదర్శి షేక్ మీరా సాహెబ్, నూరుభాషా నాయకులు, షేక్ మస్తాన్ (అగ్ని ), షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

# నవతరానికి గ్రంధాలయాలు ఎంతో ఉపయోగకరం



**బుచ్చిరెడ్డిపాలెం, మేజర్‌న్యూస్ :** సమాజంతో కలిసి మెలిసి ఆరోగ్యంగా, ఆనందంగా జీవించడానికి అవసరమైన విలువలు, విజ్ఞానం, వికాసం, నైపుణ్యం నవతరానికి అందించేవి గ్రంథాలయాలని బుచ్చిరెడ్డిపాలెం మండల విద్యాశాఖ అధికారి-2 పాతపాటి వెంకటరత్నం అన్నారు. బుచ్చిరెడ్డిపాలెం శాఖా గ్రంథాలయంలో శుక్రవారం వేసవి విజ్ఞాన శిబిరం ముగింపు కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులలో నాయకత్వ లక్షణాలు, సృజనాత్మకత, ఐకమత్యం, పుస్తక పఠనం, వ్యక్తిత్వ వికాసం వంటి లక్షణాలు ప్రతిరోజు గ్రంథాలయానికి రావడం వల్లే వికసిస్తాయన్నారు. వేసవి విజ్ఞాన శిబిరంలో చురుకుగా పాల్గొని పలు పోటీలలో గెలుపొందిన విజేతలకు ప్రశంసా పత్రాలు, విద్యాసామాగ్రి పంపిణీ చేశారు. శాఖా గ్రంథాలయంలో రెండు సంవత్సరాలపాటు సేవలందించి రంగనాయకులపేట గ్రంథాలయానికి బదిలీ కాబడిన గ్రంథాలయ అధికారిని కే.మంజులతను సేవలను కొనియాడి ఘనంగా సత్కరించారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన గ్రంథాలయ అధికారి నరసింహారావును స్వాగతించారు. గ్రంథాలయంలో అత్యున్నత సేవలు అందించి మౌలిక సదుపాయాలు ఏర్పాటుచేసిన రిటైర్డ్ లైబ్రేరియన్ భూపతి సత్యనారాయణ సేవలను ప్రశంసించారు. 40 రోజుల పాటు అలుపెరగకుండా నిత్యం గ్రంథాలయానికి సృజనాత్మక కార్యక్రమాలను పిల్లలకు పరిచయం చేసి ఆనందంగా, ఆహ్లాదంగా వేసవి విజ్ఞాన శిబిరాన్ని నిర్వహించిన ఉపాధ్యాయులు, సామాజికవేత్త గండికోట సుధీర్ కుమార్‌ను ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ అధికారిణి కే.మంజులత, గ్రంథాలయ అధికారి నరసింహారావు, గ్రంథాలయ రత్న పురస్కార గ్రహీత గండికోట సుధీర్ కుమార్, పద్మశాలి కార్పొరేషన్ డైరెక్టర్ తాళ్ల నరసింహ స్వామి, రిటైర్డ్ లైబ్రేరియన్ భూపతి సత్యనారాయణ, యోగా మాస్టర్ పచ్చారి శ్రీనివాసులు, విద్యార్థులు పాఠకులు పాల్గొన్నారు.

## బడి బయట పిల్లలను పాఠశాలలో చేర్పించాలి



**వింజమూరు, మేజర్‌న్యూస్ :** సమాజంలో బడి బయట పిల్లలను పాఠశాలలో చేర్పించాలని అధికారులను పౌర సంస్థలను ప్రజాప్రతినిధులను లోక్ దాలత్ సభ్యులు మాలకొండరెడ్డి తెలిపారు. సమాజంలో బాల కార్మికులు పెరుగుతున్నారని దీని కొరకు పౌర సంస్థలు నిరంతరం కృషి చేసి బాల కార్మిక వ్యవస్థను నిర్మూలించి బాలల భవిష్యత్తు బంగారు భవిష్యత్తు అని లోక్ అదాలత్ సభ్యులు ఎం.మాలకొండారెడ్డి పేర్కొన్నారు. బడి బయట పిల్లలను పాఠశాలలో చేర్పించాలని కోరారు. తల్లిదండ్రుల అవగాహన లోపం వల్ల వీధిలో తిరుగుతున్న బాల బాలికలను పాఠశాలలో చేర్పించి విద్యాహక్కు చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలని కోరారు. బాలకార్మిక వ్యవస్థను నిర్మూలించడానికి లెక్క లేనన్ని చట్టాలు అమల్లో ఉన్నప్పటికీ బాలకార్మిక వ్యవస్థ పెరుగుతూనే ఉంది ఇప్పటికైనా ప్రజా ప్రతినిధులు పౌర సంస్థలు కలిసికట్టుగా కృషి చేసి బాలల హక్కులను పరిరక్షించి బాలబాలికలను పాఠశాలకు పంపాలని కోరినారు సమాజంలో బాల బాలికలను హోటల్లో గాని ఫ్యాక్టరీలో గాని షాపుల్లో గాని పనిచేయించుకోవడం నేరమన్నారు. విద్యాహక్కు చట్టంపై ప్రజలకు అవగాహన పెంపొందించి బాల బాలికలను ఉన్నత విద్యను అభ్యసించడానికి ప్రోత్సహించాల్సిన బాధ్యత సమాజంపై ఉందన్నారు. దీని కొరకు మేధావులు ఉద్యోగులు తల్లిదండ్రులు నిరంతరం కృషి చేయాలి అన్నారు.

## షైనింగ్ స్టార్స్ ప్రతిభ అవార్డుకు ఎంపికైన కార్తికేయ



**వింజమూరు, మేజర్‌న్యూస్ :** వింజమూరులోని శ్రీ సరస్వతి ఉన్నత పాఠశాల విద్యార్థి సిహెచ్ కార్తికేయ ప్రతిభ అవార్డుకు ఎంపిక పాఠశాల యాజమాన్యం పోలు అంకిరెడ్డి తెలిపారు శుక్రవారం విడుదలైన ఫలితాలలో కార్తికేయ ఎంపిక కావడం సంతోషదాయకమని తెలిపారు. ఇటీవల విడుదలైన పదవ తరగతి పరీక్ష ఫలితాలలో కూడా 600 మార్కులకు 586 మార్కులు సాధించి తమ సత్తాను చాటాడు అదేవిధంగా ప్రస్తుతం ప్రతిభా పరీక్షలో కూడా అవార్డును పొందడం గర్వకారణమని తెలిపారు. ఈ విద్యార్థి భవిష్యత్తులో కూడా ఉత్తమ అవార్డులను పొంది గొప్ప స్థాయిని పొందాలని అభినందించారు అవార్డు పొందుతున్న విద్యార్థిని కరస్పాండెంట్ అంకిరెడ్డి ఆర్వి వెంకటేశ్వర్లు ఉపాధ్యాయ బృందం అభినందించారు.

## బలిజేపల్లిని పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి



**కావలి, మేజర్‌న్యూస్ :** కావలి పట్టణ జిల్లా రైతు సంఘం కమ్యూనిస్టు నాయకులు బలిజేపల్లి వెంకటేశ్వర్లు తాలూకు సంబంధించిన శాస్త్ర చికిత్స చేయించుకొని ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్నారు. విషయం తెలుసుకున్న వైఎస్సార్సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ మాజీ ఎమ్మెల్యే రామ్‌రెడ్డి ప్రతాప్ కుమార్ రెడ్డి వైఎస్ఆర్సిపి నాయకులు కలిసి శుక్రవారం పుల్లారెడ్డి నగర్‌లో ఉన్న వారి గృహానికి వెళ్లి పరామర్శించారు. అనంతరం కొద్ది నిమిషాలు కావలి నియోజకవర్గం రాజకీయ పరిస్థితులను చర్చించుకున్నారు. వీటితో పాటు వైఎస్ఆర్సిపి పట్టణ అధ్యక్షులు, మాజీ కౌన్సిలర్స్ వైఎస్ఆర్సిపి నాయకులు ఉన్నారు.

### స్త్రీ శిశు సంక్షేమ శాఖ

## జిల్లా అధికారిగా బి.హేనాసుజన్



**నెల్లూరు రూరల్, మేజర్‌న్యూస్ :** జిల్లా స్త్రీ శిశుసంక్షేమాధికారిగా హేనాసుజన్‌ని నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఇక్కడ పనిచేస్తున్న సువర్ణ ప్రకాశం జిల్లాకు బదిలీ అయ్యారు. స్త్రీ శిశు సంక్షేమాధికారిగా గతంలో పని చేసిన హేనాసుజన్ రెండోసారి జిల్లాకు వచ్చారు. శుక్రవారం జిల్లా స్త్రీ శిశు సంక్షేమ శాఖ కార్యాలయంలో బి.హేనా సుజన్ విధులలో జాయిన్ అవ్వడం జరిగింది.

# సీనియర్ సిటిజన్స్‌కు రేపు ప్రత్యేక యోగా కార్యక్రమం

## జిల్లా కలెక్టర్ కార్తీక్

**నెల్లూరు కలెక్టరేట్, మేజర్‌న్యూస్ :** ఈనెల 8వ తేదీ ఆదివారం ప్రత్యేకంగా సీనియర్ సిటిజన్స్‌కు యోగా కార్యక్రమం నిర్వహిస్తున్నామని జిల్లా కలెక్టర్ కొల్లాబత్తుల కార్తీక్ తెలిపారు. శుక్రవారం ఆయన జిల్లా అధికారులు, ఎంపీడీవోలు, మునిసిపల్ కమిషనర్‌లతో టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఆదివారం నెల్లూరు, కావలి, ఆత్మకూరులలో నిర్వహిస్తున్నామని, నెల్లూరులో చిల్డ్రన్ పార్క్, ఏసీ స్టేడియం, రామచంద్ర మిషన్‌లలో జరుగుతుందని వాకర్స్ అసోసియేషన్స్, సీనియర్ సిటిజన్స్ అసోసి యేషన్స్‌తో సంప్రదించి ఎక్కువ మంది హాజరయ్యే విధంగా చూడాలని మునిసిపల్, స్పోర్ట్స్ అధికారులకు కలెక్టర్ సూచించారు. అలాగే 9వ తేదీన అన్ని గ్రామ సచివాల యాలలో, వార్డు సచివాలయాలలో యోగా ర్యాలీలు నిర్వహించాలన్నారు. 21వ తేదీ జరిగే అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని ముందుగానే యోగా చేసే ప్రాంతాలను గుర్తించి 14వ తేదీన అన్ని గ్రామాలు, మండలాలు, డివిజన్లు, జిల్లా కేంద్రాలలో యోగా డెమోన్‌స్ట్రేషన్ చేయాలన్నారు. అందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు



చేయాలని అధికారులకు సూచించారు.

# ఉగ్రదాడిలో మృతి చెందిన కుటుంబానికి ఆర్థికసాయం



**కావలి, మేజన్‌న్యూస్ :** ఇటీవల కాశ్మీర్లో పహల్గాం ఉగ్ర దాడిలో నెల్లూరు జిల్లా కావలికి చెందిన మధుసూదన్ కుటుంబానికి పవన్ కళ్యాణ్ వ్యక్తిగతంగా 50 లక్షల రూపాయలు ఆర్థిక సహాయాన్ని వారి కుటుంబ సభ్యులకు మంత్రి కందుల దుర్గేష్ ద్వారా మధుసూదన్ కూతురికి 22 లక్షల 50 వేల రూపాయలు కుమారునికి 22 లక్షల 50 వేల రూపాయలు తల్లిదండ్రులకు 5లక్షలు అందజేశారు. మధుసూదన్ కుటుంబానికి అన్ని విధాల అండ ఉంటామని హామీ ఇచ్చారు. అలాగే జనసేన నాని సహాయ సహకారాలు ఆ కుటుంబానికి ఎల్లప్పుడూ ఉంటాయని మధుసూదన్ ఆత్మకు శాంతి కలగాలని మంత్రి దుర్గేష్ ప్రార్థించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, ఉన్నాడు ఈ ఘటన తెలిసిన వెంటనే డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ చెల్లించి పోయారని తెలిపారు. ఈ క్రమంలో మధుసూదన్ కుటుంబాన్ని ఆదుకోవాలని తమ నాయకుడు పవన్ కళ్యాణ్ నిర్ణయించిన నేపథ్యంలో తాము కాములకు వచ్చి స్వయంగా కుటుంబాన్ని పరామర్శించి ధైర్యం చెప్పినట్లు మంత్రి తెలిపారు. ఈ సందర్భంగా పవన్ కళ్యాణ్ సహాయ సహకారాలు కుటుంబానికి ఎల్లప్పుడు ఉంటాయని హామీ ఇచ్చారు. చిన్న కార్యకర్త మొదులుకోని రాష్ట్ర స్థాయి నాయకుల వరకు సైతం ఏ సహాయం కావాలన్నా పార్టీ తరపున అండదండలుగా నిలబడతామని కుటుంబానికి ధైర్యాన్ని మంత్రి కల్పించారు ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు పాల్గొన్నారు.

# విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ మీదపడి మహిళకు తీవ్ర గాయాలు

## విద్యుత్ శాఖ నిర్లక్ష్యమేనంటూ ప్రజల అగ్రహం

**ఉదయగిరి, మేజర్‌న్యూస్ :** స్థానిక ఆనకట్ట సమీపంలో ప్రమాదవశాత్తు కాలు జారి విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ పై పడడంతో మంటలు చెలరేగి ఓ మహిళకు తీవ్ర గాయాలైన సంఘటన శుక్రవారం చోటుచేసుకొంది. వివరాల మేరకు మండలంలోని మాసాయిపేట గ్రామానికి చెందిన రాగిపాటి నరసమ్మ పట్టణంలోని పలు నివాసాల్లో పాచి పని చేసి సాయంత్రానికి స్వగ్రామానికి చేరుకుంటుంది. ఈ తరుణంలో శుక్రవారం సైతం ఓ నివాసంలో పని చేసి స్వగ్రామానికి వెళ్లేందుకు ఆనకట్ట మీదుగా నడుచుకుంటూ బస్టాండ్ కు వెళుతుంది. ఈ క్రమంలో గుంతలో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ వద్దకు రాగా కాలుజారి దానిపై పడింది. దీంతో పెద్దశబ్దంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడి మంటలు చెలరేగడంతో ఆమెకు తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు ఎస్ఐ కర్నాటి ఇంద్రసేనారెడ్డి, విద్యుత్ సిబ్బందికి సమాచారం అందించడంతో వారు హుటాహుటిన అప్పడికి చేరుకున్నారు. కాలిన గాయాలతో గుంతలో ఆర్తనాదాలు చేస్తున్న నరసమ్మను బయటకు తీసి చికిత్స నిమిత్తం ఆటోలో వైద్యశాలకు తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం నెల్లూరు తరలించారు. నరసమ్మ కుమార్తె శ్యామల ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు వివరాలు నమోదు చేసుకున్నాడు. విద్యుత్ శాఖ నిర్లక్ష్యమేనంటూ ప్రజల అగ్రహం విద్యుత్ శాఖ



అధికారుల నిర్లక్ష్యంతోనే ప్రమాదం జరిగిందని పట్టణ ప్రజలు అగ్రహం వ్యక్తం చేస్తున్నాడు. ఆనకట్ల సుందరీకరణ పనుల్లో భాగంగా కట్ట ఏర్పాటు చేయడంతో ట్రాన్స్‌ఫార్మర్ దిగువకు చేరింది ట్రాన్స్‌ఫార్మర్‌తో ప్రమాదం పొంచి ఉండని, మార్చాలని పలుమార్లు పట్లణ ప్రజలు విద్యుత్ శాఖా ఉదికారులు, సిబ్బందికి సూచించినా పట్టించుకోలేదని మండిపడుతున్నారు. కాంట్రాక్టర్ బిల్లులు చెల్లించలేదని సాకులు చెపుతూ కాలయాపన చేస్తూ వచ్చారన్నారు ప్రతిరోజూ ఉదయం, సాయంత్రం సమయాల్లో ఆనకట్టపై వాకింగ్ చేసే వారు సైతం మూగజీవాలు మృత్యువాత పడుతున్నాయని. త్వరితగతిన ట్రాన్స్‌ఫార్మర్‌లు మార్చాలని సోషల్ మీడియా వేదికగా సూచించాన వారు పెడచెవిన పెట్టడంతోనే ఈ ఘటనలో చోటుచేసుకొందని పట్టణ ప్రజలు అగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

## పారిశుద్ధ్య పనులు పర్యవేక్షించిన హెల్త్ ఆఫీసర్

**నెల్లూరు కార్పోరేషన్, మేజర్‌న్యూస్ :** నెల్లూరు నగరపాలక సంస్థ ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ చైతన్య పారిశుధ్య పనుల పర్యవేక్షణలో భాగంగా శుక్రవారం స్థానిక 17వ వార్డు ఆకుతోట సచివాలయ ప్రదేశం లో పర్యటించారు. ప్రధాన రహదారి పక్కన ఆకతాయిలు అక్కడ మొక్క లకు నిప్పంటించగా దానిని వెంటనే సెక్రటరీ, మేస్త్రిల సహాయంతో ఆర్పించివేశారు. 17వ వార్డు నారాయణ మెడికల్ కళాశాల సమీపంలో గల ఫుడ్ ట్రక్ వద్దకు వెళ్లి హైజిన్ అండ్ శానిటేషన్ గురించి ఇన్స్పెక్షన్ చేశారు. ఫుడ్ వేస్ట్ సరైన పద్ధతిలో డిస్పోస్ చేయకుండా ఉండుట గానీ, ఎస్‌యుపి ప్లాస్టిక్, 125 మైక్రాన్స్ కంటె తక్కువ వున్న పాలిథిన్ కవర్ వాడకం గాని వేడివేడి పదార్థాలు ప్లాస్టిక్ కవర్ మీద పెట్టి సర్వ్ చేయడం గాని చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అక్కడే నూత నంగా ప్రారంభించిన మెస్ యాజమాన్యం పక్కనే ఉన్న ఖాళీ స్థలంలో పైప్ పెట్టి వాటర్ వేస్ట్ వదలడం గమనించి వాళ్లు దగ్గర్లో ఉన్న డ్రైన్‌కి కనెక్షన్ ఇచ్చుకోవాల్సిందిగా సూచించారు అలాగే ట్రేడ్ లైసెన్స్ కూడా త్వరగా తీసుకోవాలని తెలియజేశారు. 19వ వార్డు రామలింగాపురం ఫ్లైఓవర్ వద్ద ఎండ్ టు ఎండ్ రోడ్ క్లీనింగ్ గురించి పరీక్షించారు, అక్కడ ఉన్న మట్టి మరకలను వాటర్ వాష్ చేసి క్లీన్ గా చేయించాలని సూచించారు.

## వెంకటసుబ్బయ్యను పరామర్శించిన మాలేపాటి




**కావలి, మేజర్‌న్యూస్ :** కావలి పట్టణంలో వైకుంఠపురం వాసులు పేపల్ల వెంకటసుబ్బయ్య అనారోగ్యంతో నెల్లూరు నారాయణ వైద్యశాల నందు చికిత్స పొందుతున్నారు. విషయం తెలుసుకున్న రాష్ట్ర ఆగ్రో ఇండస్ట్రీస్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పరామర్శించారు. అనంతరం డాక్టర్లతో మాట్లాడి మెరుగైన వైద్యం అందించాలని వాళ్ళ కుటుంబానికి ఎల్లప్పుడు తోడుకుంటామని భరోసాను కల్పించారు.

## ఇంటి వద్దకే రేషన్ సరుకులు పంపిణీ



**ముత్తుకూరు, మేజర్‌న్యూస్ :** ముత్తుకూరు మండలం వల్లూరు పంచాయతీలో రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు సర్వేపల్లి నియోజక వర్గ ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్ర మోహన్ రెడ్డి సూచనలతో వృద్ధులకు వికలాంగులకు రేషన్ సరుకులు ఇంటి వద్దనే పంపిణీ చేసాము అని తిరుపతి పార్లమెంటు తెలుగు యువత ఉపాధ్యక్షులు తుమ్మల శ్రీనాథ్ మేజర్ న్యూస్‌కు తెలియజేశారు. ఈ కార్యక్రమం విజయవంతం చేస్తున్నామని అందుకు గ్రామస్తులు, వృద్ధులు, వికలాంగులు, ప్రజలు హర్షం వ్యక్తం చేయడం జరిగింది అన్నారు.

## రీ సర్వేలో తప్పిదాలను సవరించాలని నిరసన

**ఉదయగిరి, మేజర్‌న్యూస్ :** మండలంలోని బండగానిపల్లి పంచాయతీలో నిర్వహించిన భూ రీ సర్వేలో చోటుచేసుకున్న తప్పిదాలను సవరించాలని శుక్రవారం బండగానిపల్లి గ్రామ రైతులు తహసీల్దారు కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ.. పంచాయతీలోని పలు సర్వే నెంబర్లలో రీ సర్వే సమయంలో అధికారుల నిర్లక్ష్యం కారణంగా గ్రామంలో లేనివారు. చనిపోయిన వారి పేర్లను ఆడంగల్‌లో నమోదు చేశారన్నారు. గత కొన్నేళ్లుగా వాటి సవరించాలని జిల్లా కలెక్టర్, ఆర్డీవో, తహసీల్దారులకు వినతిపత్రాలు అందజేసినా పట్టించుకొన్న పాపానపోలేదన్నారు. తప్పిదాలవలన గ్రామంలో వివాదాలు చోటుచేస కొంటున్నాయని, పంటల సాగుకు రుణాల తీసుకునేందుకు వీలులేకుండా పోతుందని వాపోయారు. అనంతరం తహసీల్దారుకు వినతిపత్రం అందజేశారు. స్పందించిన ఆమె వీఆర్వో, సర్వేయరును పంపి విచారణ చేపట్టి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు.

## భలే జ్ఞాపకాలు పుస్తకావిష్కరణ




**ఉదయగిరి, మేజర్‌న్యూస్ :** తన జీవితంలో ఎదురైన ఆసక్తికర సంఘటనలు చక్కగా అక్షరీకరించి పుస్తక రూపంలోకి తేవడం అందరికీ సాధ్యం కాదని ఉదయగిరి జిల్లా సాధన సమితి అధ్యక్షులు కె.వేణుగోపాల్ అన్నారు. సీనియర్ జర్నలిస్ట్ ఉదయగిరి ఫయాజ్ రచించిన భలే జ్ఞాపకాలు పుస్తకాన్ని శుక్రవారం ఉదయగిరిలోని ఐటిఐ కాలేజిలో ఆయన ఆవిష్కరించారు. దక్షణ భారత దేశంలోని నాలగు రాష్ట్రాల్లో ప్రముఖ తెలుగు దినపత్రికలో సబ్ ఎడిటర్ నుండి చీఫ్ బ్యూరో వరకు కీలక హెూదాల్లో పనిచేసిన ఉదయగిరి ఫయాజ్ ధన్యుడని, గతంలో రచించిన రెండుపుస్తకాలు సినీ నటులచే అవిష్కరించారని చెప్పారు. మరిన్ని పుస్తకాలు ఆయన కలంనుంచి వెలువడాలని కోరారు. ఈ సందర్భంగా రచయిత ఉదయగిరి ఫయాజ్ మాట్లాడుతూ తను పుట్టిన ఊర్లో తనకు ఎన్నో అనుభూతులు, వింత సంఘటనలు జ్ఞాపకాల దొంతరలో మెదులుతున్నాయని వాటిలో కొన్ని ఆసక్తి కరమైనవి భలే జ్ఞాపకాలులో పొందుపర్చానన్నారు. ఉదయగిరి ఖాదరీయ ఆస్తాన అధ్యక్షులు షేక్ అహమద్ భాష జిల్లాపరిషత్ కోప్షన్ సభ్యుడు గాజుల తాజుద్దీన్, జనవిజ్ఞానవేదిక జిల్లా నాయకులు దస్తగిరి అహమద్ తదితరులు పాల్గొన్నారు.

# ఆత్మకూరుకు దక్కిన జిల్లా సహకారబ్యాంక్ పదవి

- చైర్మన్‌గా మెట్టుకూరు బాధ్యతలు స్వీకరణ
- ఆత్మకూరులో హర్షాతిరేకం



**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** జిల్లా కేంద్రసహకారబ్యాంక్ చైర్మెన్ పదవి ఎట్టకేలకు ఆత్మకూరు నియోజకవర్గానికి దక్కడం. గతంలో ఇదే పదవిని ఐదేళ్ళపాటు నిర్వహించిన మెట్టుకూరు ధనుంజయరెడ్డికి రెండవదపా ఛాన్స్ లభించడం తెల్సిందేకాగా ఆయన శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. దాంతో ఆత్మకూరు ప్రాంతంలో తెలుగుదేశం శ్రేణుల్లో హర్షాతిరేకాలు వ్యక్తంకావడంతోపాటు ఆయనను అభినందించారు. ఈపదవి ఇతర నియోజకవర్గాల వారు ఆశిస్తున్నారని, అక్కడి ప్రజాప్రతినిధులు తీవ్రంగా యత్నిస్తున్నారన్న ప్రచారం ముమ్మరంగా సాగగా ఎట్టకేలకు స్థానిక ఎమ్మెల్యే, రాష్ట్ర దేవాదాయశాఖామంత్రి ప్రత్యేక పట్టుదలతో మెట్టుకూరు ధనుంజయరెడ్డికి ఇప్పించుకొని తన సత్తాచాటారు. ఆత్మకూరు నియోజకవర్గంలోని అనంతసాగరం మండలం లింగంగుంటకు చెందిన ధనుంజయరెడ్డి ఒకటిన్నరదశాబ్ధకాలంగా ప్రత్యక్షరాజకీయాల్లో ఉన్నారు. ఆయన మొదటినుండి మంత్రి ఆనం రామనారాయణరెడ్డి అనుచరుడుగా, అత్యంత సన్నిహితుడుగా ఉంటున్నారు. ఆయన గతంలో జిల్లా కేంద్రసహకారబ్యాంక్ చైర్మెన్‌గా ఐదేళ్ళపాటు వ్యవహరించారు. ఆత్మకూరు, వెంకటగిరి నియోజకవర్గాల్లో అనుచర,బంధుగణం అధికంగా ఉన్న ధనుంజయరెడ్డి గతంలో తెలుగుదేశంలో, వైసిపిలో ఎమ్మెల్యే టిక్కెట్ కూడా ఆశించారు. వివిద నియోజకవర్గాల ఇన్‌చార్జ్‌గా, పరిశీలకులుగా కూడా వ్యవహరించారు. ఆయన గత ఎన్నికల్లో అసెంబ్లీకి పోటీ చేయనున్నారన్న ప్రచారం కూడా సాగింది. గత ఏడాది జరిగిన ఎన్నికల సందర్భంగా ధనుంజయరెడ్డి ఆనం చెంతకు చేరుకొని ఆయన విజయం కోసం అహర్నిశలు ప్రత్యేక శ్రద్ధతో కృషి చేశారు. వివాదరహితుడుగా, సౌమ్యుడుగా, నాయకత్వపటిమగల నాయకుడుగా ఉన్న ధనుంజయరెడ్డికి ఈదపా డిసిసిబి చైర్మెన్ పదవి లబిస్తుందా, లేదా ఏదేని కార్పోరేషన్ పదవి వరిస్తుందా అని పలువురు చర్చించకుంటుండేవారు. డిసిసిబి ఇతర నియోజకవర్గానికి వెళుతుందన్న ప్రచారం సాగగా ఆనం రామనారాయణరెడ్డి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు వద్ద ఉన్న మంచి పరపతితో తన అనుచరుడైన ధనుంజయరెడ్డికే డిసిసిబి చైర్మెన్ పదవి దక్కేలా యత్నించి తన సీనియారిటీ, సమర్ధత, సత్తా చాటుకున్నారు. గతంలో మెట్టుకూరు డిసిసిబి చైర్మెన్‌గా వ్యవహరించిన సమయంలో బ్యాంకును బాగా అభివృద్ధిచేయడం, లాభాలబాటపట్టించడం, జిల్లా వ్యాప్తంగా ప్రాధమిక సహకారసంఘాలకు ఇతోధికంగా రుణాలందించి రైతులకు అత్యంత ప్రయోజనం కల్పించడంతోపాటు సొసైటీలను బలోపేతం చేశారు. ధనుంజయరెడ్డి గతంలో డిసిసిబి చైర్మెన్‌గా వ్యవహరించిన అనుభవంతోపాటు రామనారాయణరెడ్డి మంత్రిగా ఉండడంతో ఈదపా మరింతగా బ్యాంకును అభివృద్ధి పరుస్తారని, రైతులకు మరింతగా సేవలందిస్తారని, సొసైటీలను మరింతగా పటిష్టం చేయగలరని సర్వత్రా భావిస్తున్నారు. ఇప్పటిదాకా ప్రభుత్వం 3విడతలుగా నామినేటెడ్ పదవులు ఇచ్చినా ఆత్మకూరు నియోజకవర్గాన్ని ఏపదవి తాకలేదని సర్వత్రా భావిస్తున్న తరుణంలో ధనుంజయరెడ్డి ప్రోటోకాల్ ఉన్న డిసిసిబి చైర్మెన్ పదవిని దక్కించుకొని నియోజకవర్గంలో నామినేటెడ్‌పదవులకు బోణీకొట్టారని పలువురు అభిప్రాయ పడుతున్నారు. ధనుంజయరెడ్డికి ఈపదవి రావడంతో ఆత్మకూరు నియోజకవర్గంలో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి.

# గ్రామాల్లో మద్యం బెల్ట్‌షాపుల జోరు

**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** ఆత్మకూరు ప్రాంతంలోని గ్రామాల్లో పరిశీలిస్తుంటే మద్యం బెల్ట్‌షాపులజోరు హుషారుగా కన్పిస్తున్నాయి. నాలుగైదు రోజులుగా మేజర్‌న్యూస్ గ్రామాల్లో పరిశీలిస్తుంటే జనాలనుండి తమ గ్రామాల్లో మద్యం విచ్చలవిడిగా విక్రయిస్తున్నారని, తమ గ్రామంలో ఐదు మంది అని ఒక గ్రామం వారంటే తమగ్రామంలో నలుగురు, తమ గ్రామంలో ఇద్దరు అమ్ముతున్నారని చెబుతున్నారు. మండలంలోని చెర్లోయడవల్లి గ్రామంలో మాత్రం తద్భిన్నంగా చెప్పారు. ఆగ్రామంలో ఎవరైనా మద్యం విక్రయిస్తే 10వేల రూపాయల జరిమానా విధించేలా ఆంక్షలు విధించుకొని కట్టుబాటు చేశారు. మండలంలో ఈ గ్రామం అన్ని గ్రామాలకు ఆదర్శంగా నిలిచింది. గ్రామాలకు మద్యంను దుకాణాదారులే సరఫరాచేస్తుంటారని చెబుతున్నారు. మహిమలూరులో మద్యం దుకాణం ఉన్నందున సమీప రామస్వామిపల్లిలో మాత్రం బెల్ట్‌షాపులు లేవని చెబుతున్నారు. మద్యం దుకాణాలను ఆత్మకూరు పట్టణంలో, మండలంలోని మహిమలూరులో ఏర్పాటు చేయగా అక్కడికెళ్ళి మద్యపానప్రియులు మద్యం తెచ్చుకోవడం కొంత తగ్గుతుందని అందరూ భావించగా గ్రామాలకే మద్యం సరఫరా అవుతుండడంతో మద్యం సేవించేవారి సంఖ్య కూడా పెచ్చుపెరిగిపోతుందని పలువురు అభిప్రాయపడుతున్నారు. కొన్నిచోట్ల దేవుడిపాట అంటూ మద్యం విక్రయించేవారు కొంత నగదును చెల్లించి మద్యం విక్రయించేలా ఏర్పాట్లు జరగ్గా మరికొన్ని చోట్ల పంచాయతీవారికి నగదు చెల్లించే ఏర్పాటు జరిగిందని చెబుతున్నారు. గ్రామాల్లో మద్యం అమ్మకాలు లేనేలేవని ప్రభుత్వం చెబుతుండగా గ్రామాల్లో ప్రజలు మాత్రం విచ్చలవిడిగా మద్యం విక్రయిస్తున్నారని చెబుతున్నారు. సంబంధిత అధికారులు మాత్రం ఎలాంటి కట్టడి చర్యలు లేకుండా మౌనంగా చూస్తున్నారని, ఎవరైనా స్క్వాడ్ సిబ్బంది దాడులు నిర్వహించినపుడు మాత్రమే సంబంధిత వ్యక్తులను తీసుకెళుతుంటారని, వారు బెయిల్‌పై వచ్చి మళ్ళీ మద్యం విక్రయాలు సాగిస్తుంటారని కొందరు చెబుతుతున్నారు. ఏదేమైనా ఆత్మకూరు మండలంలోని గ్రామాల్లో మాత్రం విచ్చలవిడిగా మద్యం అమ్మకాలను సాగిస్తున్నారని ఆయా గ్రామాల ప్రజలనుండి తెలుస్తోంది. ఈపరిస్థితి మహిళలకు కూడా ఇబ్బందికరంగా ఉంటుందని పలువురు అభిప్రాయపడుతున్నారు. మరి అధికారులు స్పందిస్తారేమో చూడాల్సి ఉంది.

# సీమాంధ్ర బీసీ సంక్షేమ సంఘం దాతృత్వం



**నెల్లూరు/వేదాయపాళెం, మేజర్‌న్యూస్ :** నెల్లూరు రూరల్ నియోజకవర్గం, చంద్రబాబునగర్ డ్యూటీస్ సమీపంలో ఉన్న తల్పగిరి కాలనీలోని స్వర్ణదీపం చారిటబుల్ ట్రస్ట్ అనాధాశ్రమంలో ఆశ్రయం పొందుతున్న వృద్ధులు, మానసిక, శారీరక వికలాంగులు, చిన్నారులకు శుక్రవారం రెండు బస్తాల మసూర బియ్యం, ఫలసరకులు, కూరగాయలు అందజేసిన సీమాంధ్ర బీసీ సంక్షేమ సంఘం సేవా కమిటీ సభ్యులు తమవంతు మానవత్వపు దాతృత్వాన్ని చాటుకున్నారు. ఈసందర్బంగా సీమాంధ్ర బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అద్యక్షుడు ఉల్లిపాయల శంకరయ్య మాట్లాడుతూ నిస్వార్ధ సేవా కార్యక్రమాల ద్వారానే భగవంతుడు ప్రసాదించిన మానవజన్మకు సార్ధకత లభిస్తుందన్న సత్యాన్ని ప్రతి ఒక్కరూ గుర్తించాల్సిన అవసరం ఉందన్నారు. శారీరక వైకల్యాన్ని సైతం లెక్క చేయకుండా సడలని ఆత్మస్థైర్యంతో స్వర్ణదీపం చారిటబుల్ ట్రస్ట్ సేవలను మరింత ముందుకు తీసుకెళుతున్న వ్యవస్థాపకురాలు ఉమామహేశ్వరి కృషి అభినందనీయమన్నారు. కుటుంబమనే నావను ఒడ్డుకు చేర్చేందుకు యవ్వన ప్రాయమంతా దారిపోసి జీవిత చరమాంక దశలో కుటుంబ సభ్యుల నుంచి ఆదరణ లేకపోవడంతో అనాధలుగానూ, నిరాశ్రయులుగానూ రోడ్లప్రక్కన ఉన్న చెట్ల నీడనో.. బస్ షెల్టర్లలోనో.. పాడుబడి నిరుపయోగంగా ఉన్న భవంతుల పంచల్లోనో.. అండర్ బ్రిడ్జిల కిందనో పట్టెడు మెతుకుల కోసం ఆశగా ఎదురుచూడాల్సిన దుస్థితి దాపురించిందన్నారు. అదేవిధంగా తల్లిదండ్రులు నిరాధరణ, తల్లిదండ్రులు లేకపోవడం వంటి కారణాల వల్ల అనాధలుగా మారుతున్న ఎందరో చిన్నారులు పిడికెడు అన్నం కోసం బాలకార్మికులుగానూ, బిక్షాటనతోనూ కాలేకడుపులతో కాలం వెళ్లదీయాల్సిన దయనీయ పరిస్థితులకు దారితీస్తున్నట్లు తెలిపారు. ఆకలితో అలమటిస్తున్న అనాధలు, నిరాశ్రయులు, అభాగ్యులకు ఆశ్రయం కల్పించి. క్షుద్బాధను తీర్చే దిశగా ప్రభుత్వం చొరవ చూపి ప్రతి నియోజకవర్గంలోనూ ఒక అనాధ వృదాశ్రమాన్ని. చిల్డ్రన్స్ హోమ్ను ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సీమాంధ్ర బీసీ సంక్షేమ సంఘం సేవాకమిటీ సభ్యులు అంబగి మురళి, ఆలూరు రాము, దేవళ్ల ఏడుకొండలు, ఓ మాధవయ్య, స్వర్ణదీపం చారిటబుల్ ట్రస్ట్ అనాధాశ్రమం వ్యవస్థాపకురాలు ఉమామహేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

## దోమల నివారణకు చర్యలు తీసుకోవాలి

**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** ఆత్మకూరు పట్టణం మున్సిపాలిటీ అన్నపేరేకానీ జనాల అవస్థలు గురించి అధికారులు, పాలకులు పట్టించుకోవడం లేదని పలువురు విమర్శిస్తున్నారు. మున్సిపల్ కేంద్రంగా ఉన్న ఆత్మకూరులో కోతులు, కుక్కలు, గోమాతల బెడద తీవ్రంగా ఉంటూ జనాలు ఆందోళనకు గురవుతూ తరచూ ఇబ్బందిపడుతున్నారు. ఇదిలా ఉండగా పట్టణంలో డ్రైనేజి వ్యవస్థ అస్థవ్యస్థంగా ఉండడం, పట్టణ మద్యలో పంటకాలువలు కూడా ఉండడంతో దోమలు విపరీతంగా ఉన్నాయి. జనాలు మెష్‌లు, దోమతెరలు తదితర ఎంతగా నివారణ చర్యలు చేపడుతున్నా దోమలు తగ్గడం లేదు. ఏళ్ళతరబడి పట్టణంలో బ్లీచింగ్ చల్లడం కానీ, ఫాగింగ్ చేయించడం కానీ, మలాథియాన్ పిచికారి చేయించడం కానీ లేనేలేదు. మున్సిపాలిటీలో ఏళ్ళ తరబడి దోమల నివారణకు మున్సిపాలిటీ తరపున చర్యలు లేకపోవడం విడ్డూరంగా ఉందని పలువురు వ్యాఖ్యానిస్తుంటారు. మున్సిపాలకులు ఈ దోమల నివారణ గురించి ఏమాత్రం ఆలోచించి కౌన్సిల్ సమావేశాల్లో చర్చించిన దాఖలాలు లేవు. అధికారులు కూడా ఈవిషయమై నిర్లక్ష్యంగా ఉన్నారన్న విమర్శలు అధికంగా ఉన్నాయి. ఎవరైనా ప్రముఖులు పర్యటించే సందర్భంగా రోడ్లపై బ్లీచింగ్ దర్శనమిస్తుందే తప్ప పట్టణంలోని అన్ని ప్రాంతాల్లో బ్లీచింగ్ చల్లించే పరిస్థితి లేదు. గతంలో ఫాగింగ్ చేయించడం, బ్లీచింగ్ చల్లించడం, మలాథియాన్ పిచికారి చేయించడం జరుగుతుండేది. నాలుగేళ్ళుగా అలాంటి పరిస్థితి లేదని సర్వత్రా విమర్శిస్తున్నారు. పాలకులపై కూడా విమర్శలు తీవ్రంగానే ఉన్నాయి. మరి పాలకులు, అధికారులు స్పందిస్తారేమో చూడాల్సి ఉంది.

## ముస్లిం సోదరులకు బక్రీద్ శుభాకాంక్షలు



**కావలి, మేజర్‌న్యూస్ :** కావలి పట్టణం, నియోజకవర్గ ముస్లిం సోదరి, సోదరులకు అల్లాహ్ ఆశీస్సులు మెండుగా ఉండాలని, అలాగే శనివారం జరిగే బక్రీద్ పండుగను భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలని వైసీపీ పట్టణ మాజీ ప్రధాన కార్యదర్శి నాయబ్ రసూల్ తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. దేవునిపై విశ్వాసంతో మంచి మార్గంలో జీవించాలని సహోదరుని ప్రేమించినప్పుడే మనలో ఉండే ప్రేమ వెల్లడి అవుతుందని అప్పుడు దేవునికి దగ్గర అవుతామని తెలిపారు. త్యాగాలకు ప్రతీక అయిన బక్రీద్‌ను ముస్లింలు భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలని కోరారు. ఉన్నదాంట్లోనే ఇతరులకు కొంచెం పంచిపెట్టే మానవత్వం యొక్క స్ఫూర్తిని బక్రీదు పండుగ కలుగచేస్తుందని తెలిపారు. అనంతరం నాయబ్ రసూల్ కావలి పట్టణ, నియోజకవర్గ ముస్లిం సోదరి, సోదరులకు బక్రీద్ పండుగ ప్రత్యేక శుభాకాంక్షలు తెలిపారు.

## సంతపేట పరిధిలో కార్డన్ సెర్చ్ ఆపరేషన్



**నెల్లూరు అర్బన్/క్రైం, మేజర్‌న్యూస్ :** జిల్లా ఎస్పీ జి.కృష్ణకాంత్ ఐపీఎస్ ఆదేశాల మేరకు, అడిషనల్ ఎస్పీ అడ్మిన్ సిహెచ్ సౌజన్య సూచనల మేరకు సామాన్య ప్రజలలో ధైర్యం నింపుతూ పోలీసు వ్యవస్థ పట్ల విశ్వాసం పెంచడానికి, అసాంఘిక కార్యకలాపాల అడ్డుకట్టే లక్ష్యంగా సంతపేట పోలీస్ స్టేషన్ పరిధిలోని బుజ్జమ్మ రేవు ప్రాంతంలో కార్డన్ సర్చ్ ఆపరేషన్ గురువారం ఉదయం నిర్వహించారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలు, దొంగతనాల నివారణ, శాంతిభద్రతలను పరిరక్షణ, అసాంఘిక శక్తుల ఏరివేతే లక్ష్యంగా సంతపేటలోని బుజ్జమ్మ రేవు లోని సుమారు 500 ఇళ్లను క్షుణ్ణంగా శోధించి, సరైన పత్రాలు లేని 31 బైకులు స్వాధీనం చేసుకున్నారు. ఇద్దరు రౌడీషీటర్ల ఇల్లలో తనిఖీ చేసి, ఐదుగురు ఆకతాయిలను గుర్తించి వారికి కౌన్సిలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా టౌన్ డీఎస్పీ సింధు ప్రియా మాట్లాడుతూ.. జిల్లాలో అసాంఘిక కార్యకలాపాల నిర్మూలనకు కఠిన ఆదేశాలు ఉన్నాయని, అదిక్రమించిన వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు నమోదు చేస్తామని ప్రజలు తమ వంతు సహకారాన్ని అందించాలని అదేవిధంగా అనుమానాస్పద వ్యక్తులకు సంబంధించిన ఏదైనా సమాచారం ఉంటే వెంటనే స్థానిక పోలీసులకు లేదా డయల్112 కు తెలియజేయాలని కోరారు. ఈ కార్డన్ సర్చ్ ఆపరేషన్ నిర్వహణలో సంతపేట మూడో పట్టణ సీఐ జి. దశరథ రామారావు ఎస్ఐ బాలకృష్ణ, వారి సిబ్బంది పాల్గొన్నారు.



# అనుమతుల ప్రకారమే భవన నిర్మాణాలు జరిగేలా పర్యవేక్షించండి

## కమిషనర్ వై.ఓ నందన్



**నెల్లూరు కార్పొరేషన్, మేజర్‌న్యూస్ :** నెల్లూరు నగర పాలక సంస్థ పట్టణ ప్రణాళిక విభాగం అనుమతుల మేరకు మాత్రమే నగరవ వ్యాప్తంగా భవనాల నిర్మాణాలు జరిగేలా ప్రతి ఒక్క వార్డు సచివాలయ ప్లానింగ్ అండ్ రెగ్యులైజేషన్ కార్యదర్శి పర్యవేక్షించాలని కమిషనర్ వై.ఓ నందన్ ఆదేశించారు. వారాంతపు సమీక్షలో భాగంగా టౌన్ ప్లానింగ్ సిబ్బందితో నగరపాలక సంస్థ కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ సెంటర్ విభాగంలో సమావేశాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. సచివాలయ పరిధిలో నూతన భవన నిర్మాణాలు జరిగేందుకు ప్లానింగ్ కార్యదర్శులు పూర్తి స్థాయిలో సహకరించాలని, క్షేత్రస్థాయిలో ప్రతి రోజు పర్యటించి నిర్మాణాల పురోగతిని పరిశీలించాలని సూచించారు. అనుమతులకు విరుద్ధంగా నగరంలో నిర్మించిన అన్ని భవనాలకు చార్జిషీట్లు దాఖలు చేయాలని ఆదేశించారు. చార్జిషీట్లలో అన్ని వివరాలను సమగ్రంగా పొందుపరిచి, దాఖలా అనంతరం తీసుకోవాల్సిన చర్యలను వేగవంతం చేయాలని సూచించారు. ఛార్జ్ షీట్ ఆధారంగా కోర్టు మంజూరు చేసిన సమన్లను అక్రమ నిర్మాణాల భవన యజమానులకు స్వయంగా అందజేయాలని కమిషనర్ ఆదేశించారు. సచివాలయం పరిధిలోని అనధికార లేఔట్లను నిర్మాణ స్థాయిలోనే గుర్తించి, అనుమతులు లేని వాటిని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. ప్లానింగ్ కార్యదర్శులు డీపీఎంఎస్ లాగిన్లలో ఉన్న తమ అప్లికేషన్లను 24 గంటల్లో స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని, అదే విధంగా ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా అందుకున్న సమస్యలకు కూడా నిర్దేశించిన సమయంలోపు పరిష్కారాలు అందించాలని కమిషనర్ ఆదేశించారు. నగరవ్యాప్తంగా పోస్టర్లు, ఫ్లెక్సీలు లేకుండా పర్యవేక్షించాలని, అనుమతులు లేని ప్రచార సామాగ్రిని వెంటనే తొలగించాలని కమిషనర్ ఆదేశించారు. షాపులు దుకాణాలకు సంబంధించిన అడ్వర్టైజ్మెంట్ బోర్డులకు పన్నులు విధించాలని కమిషనర్ ఆదేశించారు. నగరంలో నెల్లూరు నగర పాలక సంస్థ పట్టణ ప్రణాళిక విభాగం వారి అనుమతుల ప్రకారమే భవనముల నిర్మాణం జరిగేవిధంగా చర్యలు చేపట్టాలని, నిర్మాణాలను పిల్లర్ల స్టేజిలోనే గుర్తించి అనుమతుల ప్రకారం నిర్మించని సందర్భంలో వెంటనే నిర్మాణ పనులను నిలుపుదల చేయవలసినదిగా ఆదేశించారు. నిర్మాణంలో ఉన్న భవనానికి సంబంధించి పట్టణ ప్రణాళిక విభాగం వారు మంజూరు చేసిన అనుమతులను నిర్మాణ ప్రదేశంలో కనిపించే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రధాన డ్రైన్ కాలువలపై ఎలాంటి ర్యాంపులు, మెట్లు తదితర నిర్మాణాలు జరగకుండా పర్యవేక్షించాలని, డ్రైను కాలువల పూడిక తీత పనులకు అటువంటి నిర్మాణాలు అడ్డంకిగా మారకుండా పర్యవేక్షించాలని సూచించారు. ఈ సమావేశంలో సిటీ ప్లానర్ హిమబిందు, సెక్రటరీ శ్రీలక్ష్మి, సూపరింటెండెంట్ నరేంద్ర, అసిస్టెంట్ సిటీ ప్లానర్ వేణు, టౌన్ ప్లానింగ్ సిబ్బంది, వార్డు సచివాలయ ప్లానింగ్ కార్యదర్శులు పాల్గొన్నారు.

# ముగిసిన శ్రీ జ్వాలాముఖి అమ్మవారి వార్షికోత్సవాలు



**తోటపల్లి గూడూరు, మేజర్‌న్యూస్ :** తోటపల్లి గూడూరు మండలం వరిగొండలో మూడు రోజులుగా కొనసాగిన శ్రీ జ్వాలాముఖి అమ్మవారి వార్షిక మహోత్సవాలు శుక్రవారంతో ముగిశాయి. శుక్రవారం అమ్మవారికి నిర్వహించిన లక్ష కుంకుమార్చన పూజలో జిల్లా నలుమూలల నుంచి మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారి ఆశీర్వాదాలు తీసుకున్నారు. మూడు రోజులపాటు ఆలయంలో అర్చకులచే విశిష్ట పూజలు ఉభయకర్తల ద్వారా గ్రామోత్సవాలు అన్నదానం నిర్వహించారు. సాంస్కృతిక భక్తి కార్యక్రమాలు భక్తులను విశేషంగా ఆకర్షించాయి. స్థానిక నేత కోడూరు చిన్న శ్రీనివాసులు రెడ్డి(బాబిరెడ్డి) దంపతుల ఆధ్వర్యంలో ఈ ఆలయ అభివృద్ధికి కృషి చేస్తూ భక్తులకు కావలసిన మౌలిక వసతులు కల్పిస్తున్నారు. మహిళలు భక్తుల కోలాహలంతో ఆలయంలో సందడి నెలకొంది. ఈ సందర్భంగా చిన్న బాబిరెడ్డి సతీమణి కోడూరు రాజేశ్వరమ్మ మాట్లాడుతూ.. ఈ ఆలయ చరిత్ర పూర్వపరాలను అమ్మవారి మహత్యాన్ని గురించి వివరించారు. ఈ ఆలయాన్ని మరింత వైభవంగా తీర్చిదిద్దేందుకు తాము కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కర్పూరం శ్రీనివాసుల రెడ్డి అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

# నెల్లూరు రూరల్‌లో ప్రారంభమైన చంద్రన్న పల్లెపండుగ

**18 గ్రామాలలో 11 కోట్ల రూపాయల వ్యయంతో అభివృద్ధి పనులు ప్రారంభోత్సవాలు**



**నెల్లూరు రూరల్, మేజర్‌న్యూస్ :** నెల్లూరు రూరల్ నియోజకవర్గంలోని గొల్లకందుకూరు, సజ్జాపురం, కొత్తవెల్లంటి, పాతవెల్లంటి, కందమూరు గ్రామాలలో అభివృద్ధి పనులకు నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి, టీడీపీ నాయకులు కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి,స్థానిక ప్రజలతో కలసి ప్రారంభోత్సవాలు చేశారు. అలాగే గత ప్రభుత్వ విధానాలతో ప్రజలు నానా అవస్థలు పడ్డారు. ప్రజలకు అవసరమైన అభివృద్ధి పనులు పూర్తిచేసి, ప్రజలకు అంకితం చేస్తామని పేర్కొన్నారు. అదేవిధంగా తెలుగుదేశం పార్టీ కూటమి అధికారంలోకి వచ్చాక నెల్లూరు రూరల్‌లో అభివృద్ధి పనుల జాతర కొనసాగుతుందని తెలిపారు. అన్ని రకాలుగా ఆంధ్రప్రదేశ్‌ను ముందుకు నడిపిస్తూ, మనకోసం కష్టం చేస్తున్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకి ప్రజలందరి ఆశీస్సులు ఉండాలి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నెల్లూరు రూరల్ నియోజకవర్గం స్థాయి నాయకులు, మండల స్థాయి నాయకులు పలు గ్రామాల నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## నల్లపరెడ్డిని పరామర్శించిన ఆనం దంపతులు



**నెల్లూరు రూరల్, మేజర్‌న్యూస్ :** మాజీ మంత్రి, వైసీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, వైసీపీ రాష్ట్ర పీఏసీ సభ్యులు నల్లపరెడ్డి ప్రసన్నకుమార్ రెడ్డి ఇటీవల చేతికి శస్త్ర చికిత్స చేయించుకున్న సందర్భంగా శుక్రవారం నాడు నెల్లూరులోని వారి నివాసంలో పరామర్శించిన జిల్లా ప్రజా పరిషత్ చైర్ పర్సన్ ఆనం అరుణమ్మ, వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నెల్లూరు రూరల్ నియోజకవర్గ సమన్వయకర్త ఆనం విజయకుమార్ రెడ్డి.

## బహిరంగ ప్రదేశాల్లో వ్యర్థాలు వేస్తే జరిమానాలు విధించండి : కమిషనర్ నందన్



**నెల్లూరు కార్పొరేషన్, మేజర్‌న్యూస్ :** నెల్లూరు నగరపాలక సంస్థ పరిధిలోని అన్ని డివిజన్లలో బహిరంగ ప్రదేశాలలో వ్యర్థాలను వేయకుండా, ఇంటింటి చెత్త సేకరణ వాహనాలకు మాత్రమే అందించేలా ప్రజలకు అవగాహన కల్పించాలని కమిషనర్ వై.ఓ నందన్ సూచించారు. పారిశుద్ధ్య పనుల పర్యవేక్షణలో భాగంగా స్థానిక 36వ డివిజన్ ఫతేఖాన్ పేట పరిసర ప్రాంతాలలో కమిషనర్ శుక్రవారం పర్యటించారు. ఈ సందర్భంగా కమిషనర్ నందన్ మాట్లాడుతూ.. డివిజన్ పరిధిలో డ్రైను కాలువల పూడికతీత, సిల్ట్ ఎత్తివేత పనులు క్రమం తప్పకుండా జరిగేలా పర్యవేక్షించాలని శానిటేషన్ విభాగం వారిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో నెల్లూరు నగరపాలక సంస్థ ఇంజనీరింగ్ విభాగం, శానిటేషన్ విభాగం అధికారులు, వార్డు సచివాలయ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

## మంత్రి కందుల దుర్గేష్‌ను కలిసిన కొట్టే



**వింజమూరు, మేజర్‌న్యూస్ :** రాష్ట్ర సినిమాటోగ్రఫీ, టూరిజం మంత్రి కందుల దుర్గేష్‌ను ఉదయగిరి జనసేన సమన్వయకర్త కొట్టే వెంకటేశ్వర్లు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయనఉదయగిరి నియోజకవర్గంలో పర్యటించి ఉదయగిరిలో ఉన్న ఉదయగిరి కోట అలాగే పలు పర్యాటక ప్రదేశాలను అభివృద్ధి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు రామచైతన్య, కమతం శ్రీను, వరికుంటపాడు కన్వీనర్ రసూల్ పటాన్, తోట మురళి, రఘు, మాధవ రావు పలువురు నాయకులు ఉన్నారు.

## కత్తిపోట్ల గురైన వ్యక్తిని పరామర్శించిన మాలేపాటి



**కావలి, మేజర్‌న్యూస్ :** కావలి నియోజకవర్గం దగదర్తి మండలం చెన్నూరు గ్రామపంచాయతీ తిమ్మారెడ్డి పాలెంకు చెందిన తెలుగుదేశం పార్టీ కుటుంబ సభ్యున్ని కొంతమంది గుర్తు తెలియని వ్యక్తులు కత్తితో పొడిచి గాయపరిచారు. అనంతరం వారు నెల్లూరు నారాయణ వైద్యశాలలో చికిత్స పొందుతున్న విషయం తెలుసుకున్న రాష్ట్ర ఆగ్రో ఇండస్ట్రీస్ డెవలప్మెంట్ చైర్మన్ మాలేపాటి సుబ్బానాయుడు వైద్యశాలకు వెళ్లి పరామర్శించి విషయాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం వారు మాట్లాడుతూ.. కత్తిపోట్లకు కారకులైన వారిని సమగ్ర విచారణ జరిపి దోషులపై తగు చర్యలు తీసుకొని విధంగా అధికారులతో మాట్లాడుతామని తెలిపారు.